వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 187

VEKUVA SAMAYAM TELUGU DAILY

* Mahabubnagar * Hyderabad * Miryalaguda & Rangareddy సంపాదకులు : కె.భాస్కర్‌రావు రూ.2.00/- పేజీలు 8 తేది: బుధవారం 05 ఆగష్టు 2026







**త్రిషపై అభ్యంతకర వ్యాఖ్యల కేసులో డీఎంకే నేత, ప్రతిపక్ష నాయకుడు ఉదయనిధి స్టాలిన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటనపై మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార పక్షంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అహంకారం చివరికి పతనానికే దారి తీస్తుందని ముఖ్యమంత్రి విజయ్ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు.**

**సమయం ప్రతినిధి:** ఉదయనిధి అరెస్టు చట్టపరమైన చర్య కాదని, కావేరి జలాల సమస్య నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు చేసిన రాజకీయ ప్రయత్నమని స్టాలిన్ ఆరోపించారు. ప్రభుత్వ అహంకారం ప్రజలకు స్పష్టంగా కనిపిస్తోందని, అలాంటి ధోరణి పతనాన్ని మరింత వేగవంతం చేస్తుందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశానికి ఒక రోజు ముందు ఈ అరెస్టు జరగడం, ప్రతిపక్ష నాయకుడిని అసెంబ్లీకి దూరంగా ఉంచే ప్రయత్నమేనన్నారు. రాజకీయ విమర్శకులు, ప్రతిపక్ష నాయకులు, విద్యార్థులు, రైతులు, నిరసనకారుల గొంతు నొక్కడానికి టీవీకే ప్రభుత్వం పదేపదే అరెస్టులను ఉపయోగిస్తోందని డీఎంకే నాయకులు ఆరోపించారు. త్రిషపై అసభ్యకర వ్యాఖ్యల వివాదం నేపథ్యంలో నమోదైన కేసులో ఉదయనిధి స్టాలిన్‌ను చెన్నైలోని ఆయన నివాసం నుంచి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణకు తరలించారు. ఈ చర్య తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర దుమారానికి దారితీసింది.




**ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో బిహార్ మాజీ ముఖ్యమంత్రి, రాజ్యసభ ఎంపీ నితీశ్ కుమార్ భేటీ అయ్యారు. పార్లమెంట్ హౌస్‌లోని ప్రధాని కార్యాలయంలో ఇవాళ (మంగళవారం) మోదీ, నితీశ్ సమావేశమయ్యారు. బిహార్‌లోని బాంకీపూర్ అసెంబ్లీ స్థానంలో బీజేపీ ఓటమి పాలైన తర్వాత మోదీని జేడీయూ అధినేత నితీశ్ తొలిసారిగా కలిశారు. దీంతో వీరిద్దరి భేటీపై ఆసక్తి నెలకొంది.**

**సమయం ప్రతినిధి:** ఈ సమావేశంలో బాంకీపూర్ సీటు కోల్పోవడం, ఓటమికి గల కారణాలు, ఎన్డీయే తదుపరి కార్యాచరణ వంటి అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఈ భేటీలో నితీశ్‌తో పాటు జేడీయూ నాయకుడు, కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, రాజ్యసభ ఎంపీ సంజయ్ కుమార్ ఝా పాల్గొన్నారు. మరోవైపు, వీరి భేటీకి సంబంధించిన సమాచారాన్ని ప్రధాన మంత్రి కార్యాలయం ఎక్స్ వేదికగా పోస్టు చేసింది. అయితే, ఈ సమావేశంలో ఏయే అంశాలపై చర్చించారనే విషయంపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. కాగా, బీజేపీ కంచుకోటగా ఉన్న బాంకీపూర్ అసెంబ్లీ స్థానాన్ని జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ కైవసం చేసుకున్నారు. నిన్న (సోమవారం) వెలువడిన ఎన్నికల ఫలితాల్లో బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్ సిన్హాను ఆయన 19,324 ఓట్ల తేడాతో ఓడించారు. ప్రశాంత్ కిషోర్‌కు 64,151 ఓట్లు రాగా.. నీరజ్ కుమార్‌కు 44,827 ఓట్లు వచ్చాయి. బాంకీపూర్ ఎమ్మెల్యేగా ఉన్న నితిన్ నబీన్.. రాజ్యసభకు ఎన్నిక, బీజేపీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆ స్థానానికి ఆయన రాజీనామా చేశారు. దీంతో బాంకీపూర్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న ప్రశాంత్ కిషోర్ విజయ బావుటా ఎగరవేశారు.




**సమయం ప్రతినిధి:** నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మండలి వెంకట కృష్ణారావు శతజయంతి కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలి వెంకట కృష్ణారావు కాంస్య విగ్రహాన్ని ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం మండలి వెంకట కృష్ణారావు స్మృతికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దేశానికి, తెలుగు భాషకు ఆయన చేసిన సేవలను మాజీ ఉపరాష్ట్రపతి ప్రశంసించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.. ఏది ప్రారంభించాలన్నా రిబ్బన్ కత్తిరించడం సరికాదన్నారు. అది బ్రిటీష్ వారు నేర్పిన విధానమని చెప్పారు. మన దేశాన్ని, మనల్ని వారు విభజించి వెళ్లారని అన్నారు. ఏదైనా ముడి వేస్తే దానిని విప్పి ప్రారంభోత్సవ సూచికగా చూడాలన్నారు. మండలి వెంకట కృష్ణారావు వంటి మహనీయుల సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకుని అమలు చేయాలన్నారు. దివిసీమ ఉప్పెన సమయంలో ఆయన చేసిన సేవలు అద్భుతమని కొనియాడారు. గాంధేయ వాదిగా ఆయన పనితీరును చూసే అదృష్టం తనకు దక్కిందన్నారు. ఏ శాఖ మంత్రిగా ఉన్నా ప్రతి పనిలో తనదైన ముద్ర వేశారని చెప్పారు. తెలుగు భాష పరిరక్షణకు మండలి బుద్ధప్రసాద్ కృషి చేస్తూ తన తండ్రి అడుగుజాడల్లో నడుస్తున్నారని అన్నారు. మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.

# సన్న వరిపై పక్కా లెక్క



- వివరాలు సేకరిస్తున్న ప్రభుత్వం
- విత్తన కొనుగోలు నుంచే ఆన్‌లైన్‌లో నమోదు
- డీలర్లకు ఆదేశాలు జారీ
- నమోదు కాని రైతులకు బోనస్ లేనట్లే



**సమయం ప్రతినిధి:** సన్నరకం వరిపై లెక్కలు ప్రారంభమయ్యాయి. సన్నాలకు ఇచ్చే బోనస్ దుర్వినియోగం కాకుండా, దళారుల చేతుల్లోకి వెళ్లకుండా ఉండేందుకు 2026 వానాకాలం సీజన్ నుంచి ప్రత్యేక విధానాన్ని ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. సన్న రకం సాగు చేస్తున్న రైతులు విత్తనాల కొ నుగోలు నుంచే ఆన్‌లైన్ లో నమోదు చేస్తున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖాధికారులకు ఆ దేశాలు జారీ చేసింది. జిల్లాలో ఎన్ని ఎకరాల్లో సన్నరకం వరి సాగువుతున్నది స్పష్టంగా నిర్ధారించేందుకు విత్త నాల కొనుగోలు నుంచే లెక్కల వివరాలను ఎప్పటి కప్పుడు డీలర్లు ఆన్లై న్లో నమోదు చేయాలని ఆదేశించింది. వ్యవసాయ విస్తరణాధి కారుల వద్ద ఉన్న లెక్కలతో ఇవి సరిపోలాలని, ఏ మాత్రం తేడా ఉండరాదని పేర్కొంది. డీలర్ల వద్ద కాకుండా సొంతంగా విత్త నాలు దాచుకుని సాగుచేసే రైతులు తమ పరిధిలోని ఏఈవో ద్వారా యా ప్‌లో నమోదు చేసుకునే వెసులు బా టును కూడా కల్పించింది. ఈ మేరకు మార్గదర్శకాలను జారీ చేసింది. 2026 వానాకాలం సీజన్‌లో నిర్దేశిత ఏడు రకాల సన్నవరి పంటలకే ప్రభుత్వం బోనస్ చెల్లించనుంది.

**ఎక్కడ కొన్నా..** రైతులు రాష్ట్రంలో ఎక్కడ విత్తనాలు కొనుగో లు చేసినా ఆ వివరాలను జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయానికి పంపిస్తారు. దీంతో సన్నరకం సాగు వివరాలు పక్కాగా తెలియనున్నాయి. దుకాణాదారులు ఈ ప్రక్రియను సక్రమంగా అమలు చేస్తున్నారా లేదా అనేది మండలస్థాయి వ్యవసాయాధికారులు పర్యవేక్షణ చేస్తారు. ఇప్పటికే కొనుగోలు చేసిన వరి విత్తనాల రకాలను సైతం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాలను ఏఈవోలు పంటల నమోదులో సరిచేసుకునే వెసులుబాటు ఉంటుంది. ఆన్?లైన్?లో విత్తన కొనుగోలు నమోదు చేయని రైతులకు బోనస్ రాదని అధికారులు చెబుతున్నారు.

# ప్రధానోపాధ్యాయుల పాత్రతోనే పాఠశాలల అభివృద్ధి సాధ్యం

**మహబూబ్‌నగర్, ఆగస్టు 4 (సమయం ప్రతినిధి):** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం, కనీస అభ్యసన సామర్థ్యాల పెంపులో ప్రధానోపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) శ్రీ మధుసూదన్ నాయక్ అన్నారు. మంగళవారం మోడల్ బేసిక్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమాన్ని ఆయన జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి విజయకుమారితో కలిసి సందర్శించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగంలో మహబూబ్‌నగర్ జిల్లాను అగ్రస్థానంలో నిలిపే బాధ్యత ప్రతి ప్రధానోపాధ్యాయుడిపై ఉందని, ఆ లక్ష్య సాధనకు అంకిత భావంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ దిశగా జిల్లా యంత్రాంగం నుంచి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అధికారులు, ప్రధానోపాధ్యాయులు సమిష్టిగా పని చేస్తే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచవచ్చని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి విజయకుమారి మాట్లాడుతూ, పాఠశాల నిర్వహణలో ప్రధానోపాధ్యాయుల నాయకత్వం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులను నిరంతరం ప్రోత్సహిస్తూ విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల అభ్యాస ఫలితాలు, పాఠశాల అభివృద్ధి, సమర్థవంతమైన నిర్వహణలో మెరుగైన పనితీరు కనబరుస్తూ లిపర్‌ఫార్మెన్స్ గ్రేడ్ ఇండికేటర్స్ (పీజీఐ)లో తెలంగాణలోనే మహబూబ్‌నగర్



జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతి ప్రధానోపాధ్యాయుడు బాధ్యతాయుతంగా పని చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, కేంద్ర ఇన్‌చార్జి బాసిత్, డీఆర్పీలు మరియు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.




**సమయం ప్రతినిధి:** అమెరికాతో దాదాపు ఆరు నెలలుగా కొనసాగుతున్న యుద్ధం ఇరాన్‌లో తీవ్ర ఆర్థిక సంక్షోభం సృష్టించింది. అక్కడి ప్రజలు ఎన్నో కష్టాలు పడుతూ రోజులను నెట్టుకొస్తున్నారు. ద్రవ్యోల్బణం పెరగడం, ఆదాయాలు తగ్గడంతో అక్కడి ప్రజలు బతుకుదెరువు కోసం తమ వద్ద ఉన్న వస్తువులను అమ్ముకోవడం లేదా అద్దెకివ్వడం ప్రారంభించారు. జుట్టు, దుస్తులు, చెప్పులు, పర్‌ఫ్యూమ్ బాటిళ్లను విక్రయించడంతో పాటు ల్యాప్‌టాప్‌లను అద్దెకిస్తూ అదనపు ఆదాయం సంపాదించే ప్రయత్నం చేస్తున్నారు. ఇరాన్‌కు చెందిన వార్తా సంస్థ ఐఎల్ఎన్ఏ ఈ పరిస్థితిని 'సర్వైవల్ ఎకానమీ'గా అభివర్ణించింది. ఇరాన్‌లోని ఆన్‌లైన్ క్లాసిఫైడ్ వెబ్‌సైట్లలో వాడిన వస్తువుల విక్రయ ప్రకటనలు భారీగా పెరిగాయి. ముఖ్యంగా మహిళలు తమ సహజ జుట్టును హెయిర్ ఎక్స్‌టెన్షన్ల కోసం విక్రయిస్తున్నారు. అలాగే ఇంట్లో ఉపయోగంలో లేని చిన్నచిన్న వస్తువులను కూడా అమ్మకానికి పెడుతున్నారు. చాలామంది తమ ల్యాప్‌టాప్‌లను కార్యాలయ పనులు లేదా ఆన్‌లైన్ తరగతుల కోసం రోజువారీ లేదా వారాల వారీగా అద్దెకిస్తున్నారు (Iranian Families). ఇరాన్‌లో ఆహార పదార్థాలు, మందులు, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో సాధారణ కుటుంబాల జీవనం భారంగా మారింది.

# తెలంగాణలో అగమ్యగోచరంగా ప్రభుత్వాస్పత్రుల పరిస్థితి: హరీశ్‌రావు



**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వాస్పత్రుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు అవసరమైన గైనకాలజీ, ఆర్థోపెడిక్, యూరాలజీ, పీడియాట్రిక్ తదితర ప్రత్యేక వైద్య సేవలను అందించే తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిస్థితి కమిషనర్ లేక గాలిలో దీపంలా మారడం శోచనీయమని తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా హరీశ్‌రావు పోస్టుపెట్టారు. గత రెండు నెలలుగా పూర్తిస్థాయి అధికారి లేకపోవడంతో పరిధిలోని ఎంసీహెచ్, జిల్లా ఆస్పత్రులు, ఏరియా ఆస్పత్రులు, సీహెచ్సీ మొత్తంగా 184 ఆస్పత్రుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.

**అధికార యంత్రాంగమే లేకుండా పోయింది..** ఆస్పత్రుల పనితీరు, ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, వైద్యుల హాజరు, ల్యాబ్ పరీక్షలు, మందుల లభ్యత తదితర అంశాలను పర్యవేక్షించే అధికార యంత్రాంగమే లేకుండా పోయిందని హరీశ్‌రావు చెప్పుకొచ్చారు. దీంతో ఒకవైపు వైద్యులు, వైద్య సిబ్బంది సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరోవైపు కాంగ్రెస్ పాలనలో ప్రజలు సరైన వైద్య సేవలు అందక అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య సిబ్బంది వేతనాలు, సర్వీస్ సమస్యలు సహా ఇతర సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో ఎపూని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా మార్చి ప్రభుత్వంలో విలీనం చేయాలని తమ హయాంలో నిర్ణయించామని ప్రస్తావించారు.

**వైద్య సిబ్బంది తీవ్ర నిరాశకు గురవుతున్నారు..** దాదాపు మూడేళ్లు గడుస్తున్నా సర్వీసు నిబంధనలు రూపొందించక పోవడం, లక్ష్యం కార్యరూపం దాల్చకపోవడం దురదృష్టకరమని హరీశ్‌రావు అన్నారు. దీంతో వైద్యులు, వైద్య సిబ్బంది తీవ్ర నిరాశకు గురవుతున్నారని చెప్పుకొచ్చారు. ఇదే విషయమై ఉద్యోగులు ప్రభుత్వానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా లాభం లేకుండా పోతోందని తెలిపారు. రోడ్లెక్కి నిరసనలు తెలియచేస్తున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. వైద్యులు, వైద్య సిబ్బంది సమస్యలతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇకనైనా నిర్లక్ష్యాన్ని వీడాలని డిమాండ్ చేశారు.

# సంపాదకీయం

## కాలానికి కత్తిరింపులు.. యుగాలకు కుదింపులు!

కాలాన్ని కత్తిరించవచ్చు! యుగాలను కుదించవచ్చు! వినటానికి ఇదంతా వింతగానూ అనిపించొచ్చు! కృతకంగానే కనిపించొచ్చు! కానీ ఈ కృతకత్వమే ఇప్పుడు మహాకార్యంలా సాగిపోతోంది. ఎన్సీఈఆర్టీ (నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రైనింగ్) పాఠ్యపుస్తకాల్లో ఈ కృత్రిమ కత్తిరింపులు సాగిపోతూనే ఉన్నాయి. మరోవంక నగరాల పేర్లూ మారిపోతున్నాయి. ఎందుకు ఇదంతా జరుగుతోందని ప్రశ్నించుకుంటే ఒక దృష్టి కనపడుతుంది. చరిత్ర గురించి ఒక అంచనా స్పష్టమవుతుంది. కాలాల కత్తిరింపులకూ యుగాల కుదింపులకూ మూలాలన్నీ ఇందులోనే ఉన్నాయి. క్రీస్తుశకం 1200లకు ముందు మనకంతా స్వర్ణయుగమేననీ ఆ తర్వాతే బానిసయుగం మొదలైందనే అంచనాతోనే పాఠ్యపుస్తకాల్లో ఈ మార్పులు జరుగుతున్నాయి. బానిసయుగం క్రీస్తుశకం 1200లోనే ఎందుకు ప్రారంభమైందన్న భావనకు అనూహ్యమైన కారణమేమీ లేదు. ముస్లిం సుల్తానుల పాలనతో (1206) బానిసయుగం మొదలైందనే ఆలోచనే దీని వెనుక ఉంది. ఈ బానిస యుగాన్ని ముస్లిం పాలనకే పరిమితం చేయలేదు. బ్రిటిషు పాలనకూ విస్తరించారు. కానీ ప్రధానంగా దాన్ని ముస్లిం నవాబులు, మొఘలు పాదుషాల పాలన చుట్టూ కేంద్రీకరించి, చరిత్ర పాఠాల్లో సంస్కరణలు మొదలుపెట్టారు. నవాబులు, పాదుషాల పాలనకు అధిక ప్రాధాన్యం ఇచ్చి మన చరిత్ర పాఠ్యపుస్తకాలను తయారుచేశారనీ.. అంటే బానిసయుగంపై అనుచితంగా దృష్టిపెట్టారనీ.. దీన్ని సవరించటమే తమ ఉద్దేశమని ఎన్సీఈఆర్టీ సమర్థించుకుంది. పాలకపార్టీ నేతలు కూడా దాన్నే పదేపదే చెప్పారు. మొత్తంమీద మన చరిత్రలో 700 సంవత్సరాల 'బానిసత్వం'పై 2014 తర్వాత చర్చ బాగా మొదలైంది. ప్రధాని మోదీ దీని గురించి పలుచోట్ల విపులంగా మాట్లాడారు. 'భారతదేశం సుమారు 700 సంవత్సరాలు బానిసత్వాన్ని అనుభవించింది. ఈ దీర్ఘకాల బానిసత్వం వల్ల మన ఆత్మవిశ్వాసం, మన సంస్కృతి, మన జాతీయ చైతన్యం దెబ్బతిన్నాయి. ఇప్పుడు ఆ బానిస మనస్తత్వం నుంచి పూర్తిగా బయటపడాలి. స్వతంత్ర భారతదేశం తన వారసత్వంపై గర్వపడుతూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి'. ఇవి ప్రధాని మోదీ అన్న మాటలు. ఇందులో 'మన ఆత్మవిశ్వాసం', 'మన సంస్కృతి', 'మన జాతీయ చైతన్యం' అన్న మూడు విషయాలు చాలా కీలకమైనవి. ఈ మూడు 700 సంవత్సరాల కాలంలో దారుణంగా దెబ్బతిన్నాయనటానికి చరిత్రలో మనకు ఆధారాలు దొరకవు. సంపద సృష్టించే శ్రామికవర్గాలు ఏ దశలోనూ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోలేదు. రైతులు పంటలు పండిస్తూనే వచ్చారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవటమూ మానలేదు. సంపదను పెంచటంలో అలసత్వాన్నీ ప్రదర్శించలేదు. పొగాకు, మిరపకాయ, మొక్కజొన్న, బంగాళాదుంప, టమాటా, బొప్పాయి, జీడిపప్పు, అనాసపండు, సీతాఫలం, పుచ్చకాయ, కర్బూజ, బాదం, పాలకూర, దానిమ్మ లాంటివన్నీ 'బానిసత్వ' కాలంలోనే విదేశాల నుంచి ఇక్కడకు వచ్చాయి. ఇవన్నీ రైతులు స్వీకరించి ఇక్కడ సాగుచేశారు. కొన్నిటిని విస్తృతంగానూ, కొన్నిటిని పరిమితంగానూ పండించారు. వస్త్రపరిశ్రమ అభివృద్ధికి విశేషంగా తోడ్పడిన చరఖా (స్పిన్నింగ్ వీల్), పత్తిని ఏకే విల్లు, తివాచీల అల్లిక, మెరుగుపూత పూసిన మట్టిపాత్రలు, బావుల నుంచి నీటిని తోడటాన్ని సులభతరం చేసిన పర్షియన్ చక్రం (ధున్కీ), కాగితం తయారీ, తుపాకులు, ఫిరంగుల నిర్మాణం, కమానులు, గుమ్మటాలు నిర్మించే శిల్పచాతుర్యం, సున్నపు గారా (లైమ్ మోర్టార్), ముద్రణ యంత్రం, ఇనుము--ఉక్కు పరిశ్రమల్లో నాణ్యతా ప్రమాణాలు పెరగటం లాంటివన్నీ 'బానిసత్వ' యుగంలోనే దేశంలో ప్రవేశించి విశేషమార్పులకు దోహదం చేశాయి. వ్యవసాయం, చేతివృత్తులు, పరిశ్రమల తీరును తీవ్రంగా ప్రభావితం చేసిన ఆ కొత్త సాంకేతిక పరిజ్ఞానాలను ఆత్మవిశ్వాసం కోల్పోయిన ప్రజలు అంత తేలికగా అందుకోలేరు. ప్రయోగశీలతే ఆత్మవిశ్వాసంపై ఆధారపడి ఉంటుంది. పాలకులది ఇస్లాం మతం కాబట్టి, రాజకీయ కారణాలతో వారు కొన్నిచోట్ల గుళ్లుగోపురాలను ధ్వంసం చేసిన ఘటనలను దృష్టిలో పెట్టుకుని 700 సంవత్సరాల కాలాన్ని మన సంస్కృతి బాగా దెబ్బతిన్న యుగంగా భావించలేం. కులంపై ఆధారపడిన మన సామాజిక వ్యవస్థను ముస్లిం పాలకులు విచ్ఛిన్నం చేయలేదు. అలా విచ్ఛిన్నం చేయాల్సిన రాజకీయ అవసరం వాళ్లకి కనిపించలేదు. ఆ అవసరం ఉండి ఉంటే దాన్ని చేసి ఉండేవాళ్లేమో. ఏ యుగంలోనైనా రాజకీయ అవసరం దేన్నైయినా చేయిస్తుంది. కులవ్యవస్థ వల్ల పన్నులను రాబట్టడం సులభం అయింది. శిస్తులు, పన్నులు వసూలుచేసే జమీందార్లూ రైతు కులాల నుంచే వచ్చారు. వాళ్లకు తోడుగా ఉండే మజుందార్లు, మున్షీలు, కరణాలు, కులకర్ణీలు, దేశ్‌పాండేలు బ్రాహ్మణ కులాల నుంచే వచ్చారు. వీళ్లపైనే ఆధారపడి ముస్లిం పాలకులు అధికారాన్ని చలాయించారు. ఏ సంస్కృతీ మార్పుచెందకుండా ఉండదు. 700 ఏళ్లల్లో భారత్ అనేక సంస్కృతుల ప్రభావానికి లోనైంది. అన్యమతాల ప్రభావంతో సర్వం నాశనమైందనుకుంటే అంతా చీకటిగానే కన్పిస్తుంది. ఎంతో గొప్ప సాహిత్యాన్ని సృష్టించిన భక్తి ఉద్యమం ఆ 700 ఏళ్ల కాలంలోనే బలపడి ప్రజలపై విశేష ప్రభావాన్ని కలగచేసింది. బలవంతపు మతమార్పిడులు పెద్దఎత్తున జరిగి ఉంటే మన సమాజ ముఖచిత్రమే మారిపోయి ఉండేది. ఇక మధ్యయుగాల్లో జాతీయ చైతన్యం గురించి ఎక్కువగా చెప్పుకోటానికి ఉండదు. మనమందరం ఒక జాతికి చెందినవారమనే భావన మధ్యయుగాల్లో ఎక్కడా లేదు. ఇది భారతదేశానికే పరిమితమైంది కాదు. యూరపులోనూ ఆనాడు జాతీయ భావన లేదు. దేశమంతా అనేక రాజ్యాలుగా విడిపోయి ఉన్న కాలంలో మనమంతా భారతీయులమనే భావననే ఊహించలేం. జాతీయ భావన ఉంటే హిందూ పాలకులు ఏకమై ఉండేవారు. విదేశాల నుంచి వచ్చిన పాలకులకు వ్యతిరేకంగా సంఘటితం అయ్యేవారు. అదెప్పుడూ జరగలేదు. హిందూ పాలకులు ముస్లిం సైన్య విభాగాలను ఏర్పాటుచేసుకుని శత్రువులపై దండెత్తిన ఘటనలు బోలెడు ఉన్నాయి. ఆనాడు విధేయత కులాలకు, తెగలకు, చిన్న ప్రాంతాలకు మాత్రమే పరిమితమై ఉండేది. ప్రతి యుగంలోనూ మంచీచెడులు ఉంటాయి. ఒక మతానికి చెందిన పాలకులందరినీ ఒకేగాటన కట్టటం సంకుచితమే అవుతుంది. మతదృష్టితో 700 సంవత్సరాల చరిత్రను కుదించివేసి, ఆ కాలంలో వచ్చిన మార్పులను విద్యార్థులకు సమగ్రంగా పరిచయం చేయకపోతే జరిగే నష్టమే ఎక్కువ. మనకు ఇష్టమున్నా లేకపోయినా మొఘలు సామ్రాజ్యకాలంలో దేశంలో ఎన్నో మార్పులు వచ్చాయి. పాలకుల మతం ఏదైనా పాలన జనరంజకంగా ఉందా? జనవినాశనంగా ఉందా? అన్నదే ప్రధానంగా చూడాలి. ప్రపంచ వస్తుసేవల ఉత్పత్తిలో (జీడీపీ) మొఘల్ పాలన ఉచ్ఛదశలో ఉన్నకాలంలో (1700) భారత్ వాటా 25శాతం ఉండేది. చైనా వాటా కూడా ఇంచుమించు అంతే. రెండు దేశాల జనాభా కూడా సమానంగానే ఉండేదని చరిత్రకారులు లెక్కలు కట్టారు. వస్త్ర ఎగుమతుల్లో ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానాన్ని సంపాదించింది. మసాలాదినుసులు, నీలిమందు, పట్టు, చేతివృత్తుల ఉత్పత్తులను విస్తృతంగా ఎగుమతి చేసేది. పర్షియా, మధ్య ఆసియా, యూరపు, ఆగ్నేయాసియా దేశాల్లో భారత ఉత్పత్తులకు విపరీతంగా గిరాకీ ఉండేది. ఇంతటి వైవిధ్యభరితమైన ఆర్థిక వ్యవస్థ ఉండి, వెండి నగదు చలామణి అధికంగా ఉన్న మొఘల్ పాలనాకాలానికి చరిత్రలో ప్రాధాన్యాన్ని తగ్గించి వేయటం మన చరిత్రను మనమే తక్కువ చేసుకోవటం అవుతుంది. హిందూ రాజుల పాలనకు తగినంత ప్రాధాన్యం ఇవ్వలేదనే వాదనతో మొఘల్ చరిత్రకు కత్తెర వేయటాన్ని సమర్థించుకుంటున్నారు గానీ అది వాస్తవాల ముందట నిలబడదు. సంగమ సాహిత్యం, చోళ, పాండ్య రాజుల ప్రస్తావన లేకుండా తమిళనాడులో చరిత్ర బోధన ఉంటుందా? అలాగే శాతవాహన, కాకతీయ, విజయనగర తదితర సామ్రాజ్యాలకు అగ్రస్థానం లేకుండా తెలుగు చరిత్ర పాఠాలు ఉంటాయా? ప్రతి భాషా రాష్ట్రమూ సొంత ప్రాంతంలో స్థానిక రాజ్యాలకు పెద్దపీట వేసింది. ఎన్సీఈఆర్టీ పాఠ్యాంశాల్లో మొఘల్ చరిత్రను కుదించటానికి ఇతర రాజ్యాలకు ఎక్కువ చోటు ఇవ్వటం అసలు కారణం కాదు. 700 సంవత్సరాల బానిసత్వం అనే సూత్రీకరణతో చరిత్రను అపసవ్య దృష్టితో చూడటంలోనే మూలం ఉంది. అనేక ప్రభావాలతో దేశంలో ఏర్పడిన ఉమ్మడి సంస్కృతిని కృత్రిమంగా కత్తిరించి తమకు ఇష్టమైన ముక్కలను మాత్రమే చూపించటానికి ఎన్ని విన్యాసాలు చేసినా సఫలీకృతం కాలేరు.

## సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ బాధితులకు అండగా, ఎంపీ డీకే అరుణ

**(సమయం ప్రతినిధి, మహబూబ్ నగర్):** మహబూబ్ నగర్ పార్లమెంట్ పరిధిలోని రంగారెడ్డి జిల్లా, కొత్తూరు మండలం, సిద్ధాపూర్ గ్రామంలో ప్రతిపాదించిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (GHMC) ఘన వ్యర్థాల నిర్వహణ (SWM) ప్లాంట్‌ను ఇతర ప్రాంతానికి తరలించాలని కేంద్ర పర్యావరణ,అటవీ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ ను ఎంపీ డీకే అరుణ కోరారు.లి జీవో నెం. 641 ద్వారా భూమి బదిలీ ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నెం. 641 (తేదీ: 02-07-2026) ద్వారా సిద్ధాపూర్ గ్రామంలోని సర్వే నెంబర్లు 252, 278, 361లలో గల 86.00 ఎకరాల భూమిని జీహెచ్ఎంసీకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. ఈ స్థలంలో ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి 'హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ మున్సిపల్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (ఎఐమీెవీ)' కు అనుమతులు మంజూరు చేశారని వివరించారు. అయితే, గతంలో ఇదే భూమిని "ఇకో-టౌన్" (Eco-Town) ప్రాజెక్ట్ కోసం ప్రతిపాదించారని కేంద్ర మంత్రికి ఎంపీ డీకే అరుణ గుర్తుచేశారు.

**జీవో 111 నిబంధనల ఉల్లంఘన మరియు పర్యావరణ ముప్పు**

తాగునీటి వనరులకు ప్రమాదం: ఈ ప్రతిపాదిత వ్యర్థాల ప్లాంట్ ఉన్న ప్రాంతం చుట్టుపక్కల దాదాపు 50 గ్రామాలు జీవో ఎంఎస్ నెం. 111 (1996) పరిధిలోకి వస్తాయని. ఈ జీవో ప్రకారం హైదరాబాద్ నగరానికి తాగునీరు అందించే ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాల చుట్టూ 10 కిలోమీటర్ల పరిధిలో ఎలాంటి కాలుష్య కారక పరిశ్రమలు లేదా తదితర యాక్టివిటీస్ చేపట్టకూడదని ఉన్న నిబంధనలు వివరించారు.ప్రజల ఆరోగ్యంపై ప్రభావం: ఈ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ లేదా వ్యర్థాల ప్లాంట్ ప్రారంభిస్తే, భూగర్భ జలాలు కలుషితమై ప్రజల తాగునీరు, ఆరోగ్యం మరియు జీవనోపాధి తీవ్రంగా దెబ్బతింటాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారని కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ దృష్టికి తీసుకువెళ్ళారు. ఈ ప్రాజెక్ట్ కు వ్యతిరేకంగా స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున ధర్నాలు,



నిరసనలు చేపడుతున్నారని. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, ఈ ప్లాంట్ ఏర్పాటుపై సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్ (2016) మరియు ఈఐఏ (EIA) నోటిఫికేషన్ (2006) నిబంధనల ప్రకారం పునఃసమీక్ష జరపాలని డీకే అరుణ కోరారు. అలాగే, స్థానిక ప్రజల అభిప్రాయాలను మరియు అభ్యంతరాలను స్వయంగా వినడానికి సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (CPCB) తో ఒక ప్రత్యేక తనిఖీ కమిటీని ఏర్పాటు చేయాలని ఆమె కేంద్ర మంత్రిని అభ్యర్థించారు. స్థానిక రైతులు, ప్రజల ఇబ్బందులను,ఆందోళనలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## విద్యా వాలంటీర్ల శిక్షణ శిబిరానికి డిఇఓకు ఆహ్వానం

**మహబూబ్ నగర్ :** జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి విజయ కుమారి గారిని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి, ఈ నెల 8, 9, 10 తేదీలలో మహబూబ్ నగర్ ఫస్ట్ శిక్షణ కేంద్రంలో నిర్వహించనున్న విద్యా వాలంటీర్ల శిక్షణ కార్యక్రమానికి ఆహ్వానించారు మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తన సొంత నిధులతో విద్యా రంగ అభివృద్ధికి కట్టుబడి చేపట్టిన 'శతశాతం' కార్యక్రమం ప్రస్తుతం మహబూబ్ నగర్ నియోజకవర్గంలో విశేష ఫలితాలను అందిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో, ప్రత్యేక పరీక్ష ద్వారా ప్రతిభావంతులైన విద్యా వాలంటీర్లను ఎంపిక చేయడం జరిగింది. ఈ వాలంటీర్లకు బోధనా నైపుణ్యాలు, విద్యార్థులతో మెలగే విధానం, పాఠ్యాంశాల లోతైన అవగాహన వంటి అంశాల్లో శిక్షణ ఇవ్వడం కోసం ఈ మూడు రోజుల శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో నిష్ణాతులైన అధ్యాపకుల బృందం పాల్గొని, ఆధునిక బోధనా పద్ధతులు, డిజిటల్ టూల్స్ వినియోగం, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, పరీక్షల సిద్ధత వంటి కీలక అంశాలపై సమగ్ర మార్గదర్శకత్వం అందించనున్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ప్రతిభను వెలికితీసి, వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా నిర్వాహకులు తెలిపారు. ఈ



నేపథ్యంలో, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి, విద్యా వాలంటీర్లకు ప్రోత్సాహం ఇవ్వాలని జిల్లా విద్యాశాఖ అధికారి గారిని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, వందేమాతరం ఫౌండేషన్ కోఆర్డినేటర్ టి. రవీందర్ రెడ్డి, జీహెచ్ఎంలు బాలు యాదవ్, ఆనంతప్ప, హెచ్ఎం హరినాథ్, రాజు నాయక్, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇజ్రాయెల్‌కున్న గొప్ప స్నేహితుల్లో మోదీ ఒకరు: బెంజమిన్ నెతన్యాహు

మొదటి పేజీ తరువాయి

భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి ఇజ్రాయెల్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అన్నారు. తనకున్న అత్యంత సన్నిహిత మిత్రుల్లో భారత ప్రధాని నరేంద్ర మోదీ ఒకరు అని, భారత్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ప్రపంచ వేదికపై ఇజ్రాయెల్‌కు బలమైన మద్దతు అందిస్తున్న దేశాల్లో భారత్ కీలకమైనదని నెతన్యాహు చెప్పారు. ఇజ్రాయెల్ ఒంటరిగా ఉందనే ప్రచారం వాస్తవం కాదని నెతన్యాహు స్పష్టం చేశారు. భారత్‌తో పాటు పలు దేశాలతో ఇజ్రాయెల్ దౌత్య, ఆర్థిక, సాంకేతిక, భద్రతా రంగాల్లో సహకారం పెరుగుతోందని చెప్పారు. ఇక, భారత్‌లో ఇజ్రాయెల్‌కు లభిస్తున్న ఆదరణ ఎంతో విలువైనదని ఆయన అన్నారు. భారత్-ఇజ్రాయెల్ మధ్య రక్షణ, వ్యవసాయం, సాంకేతికత, సైబర్ భద్రత, ఆవిష్కరణలు వంటి అనేక రంగాల్లో ఇప్పటికే బలమైన భాగస్వామ్యం కొనసాగుతోంది. ఇటీవలి కాలంలో ఇరు దేశాల నాయకుల మధ్య సన్నిహిత సంబంధాలు మరింత బలపడటంతో వ్యూహాత్మక సహకారం కూడా వేగంగా విస్తరిస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రధాని మోదీ, ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లి పలు కీలక ఒప్పందాలు చేసుకున్న సంగతి తెలిసిందే.

## ఆశావహులు.. అదుపు తప్పుతున్నారా

కాకినాడ, ఆగస్టు 4 : టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు ధిక్కార స్వరం వినిపిస్తున్నారా? స్థానికంగా తన హవాను పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారా? అంటే.. అవుననే సమాధానమే టీడీపీ వర్గాల్లో వినిపిస్తోంది. కాకినాడ పోర్టును విస్తరించే పనులకు ఆయన సుముఖంగానే ఉన్నా.. పార్టీ పరంగా ఆయన వ్యవహరించడం లేదనే టాక్ వినిపిస్తోంది. కాకినాడ పోర్టకు కోన పోర్టుగా పేరు పెట్టాలన్నది యనమల డిమాండ్. అయితే.. ఇది సాధ్యమేనా? అనేది ప్రశ్న పైగా ఎవరికీ లేని ఈ డిమాండ్ విషయంలో యనమల స్థానికతను పురిగొల్పుతున్నారు. పోర్టుకు అవసరమైన భూములు ఇస్తోంది కోనసీమ ప్రాంత రైతులని, కాబట్టి.. పోర్టుకు కోన పేరు పెట్టాలన్నది యనమల సూచన. ఇదే ఇప్పుడు డిమాండ్‌గా మారుతోంది. ఈ నెల 20లోగా ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుని కోన పోర్టుగా పేరు నిర్ధారించాలని.. లేకపోతే, ప్రజల ఆకాంక్షల మేరకు తాను కూడా వ్యవహరిస్తానని చెప్పు కొచ్చారు. ఈ వ్యవహారంపై ఆయన ప్రభుత్వానికి లేఖ కూడా రాశారు. తాజాగా స్థానికులతో భేటీ కావడం మరింత ఆసక్తిగా మారింది. కోన సీమ రైతు ల నుంచి భూములు తీసుకుంటున్నారని, అలాంటప్పుడు కాకినాడ పోర్టు అని పేరు ఎందుకని ఆయన చెబుతున్నారు. అయితే.. వాస్తవానికి.. భూములు తీసుకున్నంత మాత్రాన అదే పేరును ఉంచాలని ఏమీ లేదు. ఈ విషయం తెలిసినప్పటికీ.. యనమల మాత్రం తన దారి తనదే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. స్థానికంగా ఇది పెద్ద ఉద్యమంగా మారాలని ఆయన ఆకాంక్షిస్తున్నట్టు తెలుస్తోంది. ప్రాధాన్యం కొరవడడంతోనే.. ఇటు పార్టీలోను, అటు ప్రభుత్వంలోనూ యనమల ప్రాధాన్యం ఒకప్పుడు ఉన్నట్టుగా ఇప్పుడు లేదు. గతంలో తిప్పిన చక్రం.. ఇప్పుడు మూలబడినట్టుగా ఆయన పరిస్థితి మారిపోయింది. ఎమ్మెల్సీగా రిటైరైన తర్వాత.. రాజ్యసభ ఆశించారు. లేదా గవర్నర్ గిరీ కోసం ప్రయత్నిస్తున్నారు. ఈ రెండు చేజారుతున్నాయి. పైగా తన ముందు రాజకీయాల్లోకి వచ్చిన వారికి పదవులు దక్కుతున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీ తనను పూర్తిగా పక్కన పెడుతోందని గ్రహిస్తున్న ఆయన.. ఇలా.. కీలక విషయాలపై ఫోకస్ చేశారని రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న మాట.

## రాజకీయాల్లోకి రావడం లేదు... పవన్ భూములు ఆక్రమించలేదు

హైదరాబాద్, ఆగస్టు 4 : తాను రాజకీయాల్లోకి వస్తున్నానంటూ గత కొంతకాలంగా సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఫుల్‌స్టాప్ పెట్టారు. తన ఉద్యోగాన్ని ప్రశాంతంగా చేసుకోనివ్వాలని కోరుతూ, జనసేన పార్టీలో చేరతాననే వార్తలను ఆయన కొట్టిపారేశారు. పవన్ కల్యాణ్‌కు సంబంధించిన కోడి చెరువు భూ వివాదం, తనపై వెలువడిన కోర్టు ధిక్కరణ ఆరోపణలపైనా ఆయన వివరణ ఇచ్చారు."నాకు మెగాస్టార్ చిరంజీవి గారి కుటుంబంతో గత 20 ఏళ్లుగా మంచి పరిచయం ఉంది. పవన్ కల్యాణ్ గారితో కూడా సాన్నిహిత్యం ఉంది. అంతమాత్రానికే నేను ఉద్యోగానికి రాజీనామా చేసి జనసేన పార్టీ నుంచి ఎమ్మెల్యేగానో, ఎంపీగానో పోటీ చేస్తానని ప్రచారం చేస్తున్నారు. తెలంగాణ జనసేన ఇన్‌చార్జ్‌గానూ నన్నే నియమిస్తారని సోషల్ మీడియాలో రాస్తున్నారు. దయచేసి నా ఉద్యోగం నన్ను చేసుకోనివ్వండి. రాజకీయాల్లోకి వచ్చే ఆలోచనే నాకు లేదు" అని రంగనాథ్ స్పష్టం చేశారు.గండిపేట సమీపంలోని జన్వాడలో ఉన్న పవన్ కల్యాణ్ భూమిపై చెలరేగిన వివాదంపై రంగనాథ్ సాంకేతిక అంశాలను వివరించారు. కోడికుంట చెరువు వద్ద ఉన్న ఈ భూమి విషయంలో వాస్తవాలను ఆయన వెల్లడించారు."పవన్ కల్యాణ్ 2014లో నలుగురు రైతుల నుంచి సుమారు 10 ఎకరాల పట్టా భూమిని కొనుగోలు చేశారు. ఆ తర్వాత 2015-16లో చెరువుకు ప్రిలిమినరీ నోటిఫికేషన్, 2023లో ఫైనల్ నోటిఫికేషన్ జారీ అయింది.

## సాలార్ జంగ్ మ్యూజియంలో సర్కారీ స్టూడెంట్లకు ఫ్రీ ఎంట్రీ

### డిసెంబర్ లోపు విహారయాత్రలు పూర్తి చేయాలని స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆదేశాలు

హైదరాబాద్ : సర్కారు బడుల్లో చదివే విద్యార్థులకు హైదరాబాద్ లోని సాలార్ జంగ్ మ్యూజియంలోకి ఉచిత ప్రవేశం కల్పించనున్నట్లు స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నవీన్ నికోలస్ వెల్లడించారు. ఈ మేరకు అన్ని జిల్లాల డీఈవో లకు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులకు మన దేశ సంస్కృతి, వారసత్వ సంపదపై అవగాహన కల్పించేందుకు ఈ విహారయాత్రలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ యాత్రలన్నీ డిసెంబర్ లోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ బడులతోపాటు ప్రైవేట్, ఎయిడెడ్ స్కూళ్ల విద్యా ర్థులు కూడా మ్యూజియాన్ని సందర్శించవచ్చ న్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయి విద్యార్థులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మ్యూజియాన్ని సందర్శించాలనుకునే పాఠశాలలు కనీసం 48 గంటల ముందే education salarjungmu-seum@ gmail.com మెయిల్ ఐడీకి సమాచారం అందించి ముందస్తు బుకింగ్ చేసుకోవాలని తెలిపారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి 30 మంది పిల్లలకు కనీసం ఒక టీచర్ తోడుగా ఉండాలని, ట్రిప్ కు వెళ్లే ముందు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రాతపూర్వక అనుమతి తీసుకోవాలని సూచించారు.

## హైదరాబాద్ స్టార్ హాస్పిటల్స్ డేటా లీక్..

హైదరాబాద్, ఆగస్టు 4 : హైదరాబాద్‌లోని స్టార్ హాస్పిటల్స్‌కు చెందిన రోగుల వైద్య రికార్డులు, వ్యక్తిగత వివరాలు, ఉద్యోగుల సమాచారం, గోప్య పత్రాలు అనుమతి లేకుండా ఓ వెబ్‌సైట్‌లో ప్రచురించబడ్డాయని ఆస్పత్రి యాజమాన్యం ఆరోపించింది. ఈ మేరకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో ఫిర్యాదు చేయగా, పోలీసులు బీఎన్ఎస్, ఐటీ చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. డేటా లీక్‌కు బాధ్యులైన వారిని గుర్తించి, సంబంధిత వెబ్‌సైట్‌ను బ్లాక్ చేయాలని ఆస్పత్రి యాజమాన్యం కోరింది.హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ స్టార్ హాస్పిటల్స్ డేటా లీక్ వ్యవహారం రాష్ట్రంలో తీవ్ర కలకలం రేపుతోంది. రోగుల వ్యక్తిగత వివరాలు, మెడికల్ రికార్డులు, ఉద్యోగుల సమాచారం, ఆస్పత్రికి సంబంధించిన గోప్య పత్రాలు అనుమతి లేకుండా ఓ వెబ్‌సైట్‌లో ప్రచురించబడ్డాయని ఆరోపిస్తూ స్టార్ హాస్పిటల్ యాజమాన్యం తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోను ఆశ్రయించింది. స్టార్ హాస్పిటల్స్ ఫిర్యాదు మేరకు పోలీసులు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), సమాచార సాంకేతిక (ఐటీ) చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అంతేకాకుండా.. ఆ వెబ్‌సైట్‌లోకి ప్రవేశించేందుకు అవసరమైన లాగిన్ వివరాలు వాట్సాప్ ద్వారా కూడా షేర్ అవుతున్నట్లు తాము గుర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.





# బస్ భవన్ ముట్టడి ఉద్రిక్తత....పోలీసులతో వాగ్వాదం

హైదరాబాద్: హైదరాబాద్‌లోని బస్ భవన్‌ను ముట్టడించిన టి.జి.ఎస్.ఆర్.టి.సి విశ్రాంతి ఉద్యోగుల ఆందోళన మంగళవారం ఉద్రిక్తతకు దారితీసింది. రిటైర్డ్ ఉద్యోగులకు మద్దతుగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ చీఫ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న బస్ భవన్‌కు చేరుకోగా పోలీసులు అడ్డుకోవడంతో కొద్దిసేపు తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో చివరకు మల్లన్నతో పాటు ఐదుగురు రిటైర్డ్ ఉద్యోగుల ప్రతినిధులకు మాత్రమే అధికారులను కలిసేందుకు పోలీసులు అనుమతి ఇచ్చారు. అనంతరం ఆర్టీసీ అధికారులతో జరిగిన సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలపై వారిని మల్లన్న నిలదీశారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రావాల్సిన PF, EPS-95, PF కాంట్రిబ్యూషన్, డీఏ, ఇతర రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉంచడం అన్యాయమని మండిపడ్డారు. 2013లో పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ఎంప్లాయర్ వాటా గ్రాఖీ ఇప్పటికీ చెల్లించలేదని, 2017 నుంచి రిటైర్ అయిన ఉద్యోగులకు 2021 నుంచి రావాల్సిన బకాయిలు విడుదల కాలేదని పేర్కొన్నారు. ఉద్యోగులు జీవితాంతం సంస్థ కోసం కష్టపడితే, రిటైర్మెంట్ తర్వాత వారికి రావాల్సిన కష్టార్జిత సొమ్మును నిలిపివేయడం అమానుషమని అన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రేవంత్ ప్రభుత్వంపై మల్లన్న తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని,సమ్మె సమయంలో కార్మికులకు అండగా ఉన్నట్లు చెప్పుకున్న ప్రభుత్వం,తర్వాత వారి సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఆర్టీసీ ఉద్యోగులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఢిల్లీ మాదిరి ఉద్యమం ఈ తెలంగాణలో పుట్టిస్తానని మల్లన్న స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి లాంటి ఒక సన్నాసి దద్దమ్మ ముఖ్యమంత్రి ఉన్నందు వలన ఆర్టీసీ కార్మికులకు ఈ పరిస్థితి ఏర్పడిందని ఇలాంటి ముఖ్యమంత్రి మన తెలంగాణకు ఉండడం దురదృష్టకరమని అన్నారు. రాబోయే రోజుల్లో ఇదే ఆర్టీసీ కార్మికులు రేవంత్ సర్కార్ ను బొందపెడుతుందని హెచ్చరించారు."17 వేల మంది రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులకు అండగా తీన్మార్ మల్లన్న ఉన్నాడని,వారి హక్కుల కోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీ చివరి వరకు పోరాడుతుందని స్పష్టం చేశారు. అవసరమైతే బస్ భవన్ ను అగ్రాస్ పాట పెట్టి అమ్మైనా సరే ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ చెల్లించుకుంటామని ఆ పరిస్థితి రాకుండా ప్రభుత్వం చూసుకోవాలని స్పష్టం చేశారు. వారం రోజుల్లో రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బెనిఫిట్స్ విడుదల చేయాలని, లేకుంటే డిల్లీ తరహాలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని కేవలం వారం రోజులే రేవంత్ సర్కార్ కు డెడ్ లైన్ అని హెచ్చరించారు. అవసరమైతే రాబోయే అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వేలాది మంది ఆర్టీసీ ఉద్యోగులతో కలిసి అసెంబ్లీని ముట్టడిస్తామని ప్రకటించారు. ఆర్టీసీ ఎన్నికల విషయాన్ని ప్రస్తావిస్తూ "దమ్ముంటే ఎన్నికలకు రండి... నేను ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల తరఫున వస్తా...రేవంత్ తన బొమ్మతో,కాంగ్రెస్ పార్టీ జెండాతో రావాలని... కార్మికులే తీర్పు చెబుతారు" అంటూ ప్రభుత్వానికి బహిరంగ సవాల్ విసిరారు."కార్మికులను మోసం చేస్తే ప్రభుత్వం, అధికారులు ఇద్దరూ మూల్యం చెల్లించుకోవాల్సిందేనని,ఆర్టీసీ ఉద్యోగులను నిర్లక్ష్యం చేసిన ఏ ప్రభుత్వం కూడా నిలబడలేదు" అని మల్లన్న హెచ్చరించారు. రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేయడంతో పాటు అసెంబ్లీ ముట్టడి సహా భారీ ఉద్యమాలకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకత్వం వహిస్తుందని ప్రకటించారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎల్లప్పుడూ ఆర్టీసీ ఉద్యోగుల పక్షాన నిలుస్తుందని, వారి హక్కుల సాధన కోసం శాసనమండలిలో, ప్రజాక్షేత్రంలోనూ తీన్మార్ మల్లన్నగా పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన్ వర్కర్స్ యూనియన్ చైర్మన్ సంపత్ ముదిరాజ్ ,రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ సాజిద్,గ్రేటర్ హైదరాబాద్ జోన్ దీక్ష గౌరవ అధ్యక్షుడు TVR,తెలంగాణ రాజ్యాధికార పార్టీ మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజక్క,సహాయ కార్యదర్శి గిరిగాని బిక్షపతి గౌడ్,రిటైర్డ్ ఆర్టీసీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



**2013, 2017,2021 వేతన సవరణ మరియు PF బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్**
**ప్రభుత్వానికి తీన్మార్ మల్లన్న డెడ్ లైన్**
**వారం రోజుల్లో బెనిఫిట్స్ ఇవ్వకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరిక**
**ఆర్టీసీ ఎన్నికల్లోనూ పోరాటానికి సిద్ధమని మల్లన్న స్పష్టం**
**రేవంత్ రెడ్డి చేతకాని దద్దమ్మ ముఖ్యమంత్రి**
**మహేష్ కుమార్ గౌడ్,పొన్నం సమాధానం చెప్పాలి**
**రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల హక్కుల కోసం బస్ భవన్‌లో గళమెత్తిన టీఆర్పీ చీఫ్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న**

## మహబూబ్ నగర్ కార్పొరేషన్ లోఘనంగా పోచమ్మ అమ్మవారి బోనాల వేడుకలు -పాల్గొన్న మహబూబ్ నగర్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్

మహబూబ్ నగర్ : స్థానిక కార్పొరేషన్ పరిధిలోని 10వ డివిజన్లలో అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించిన శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ అమ్మవారి బోనాల మహోత్సవాల్లో మహబూబ్ నగర్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ శ్రీ మారేపల్లి సురేందర్ రెడ్డి (MSR) ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారి దర్శనం చేసుకొని, నగర ప్రజలందరిపై అమ్మవారి దివ్య ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. మన సాంప్రదాయ వేడుకలు నగరంలో ఐక్యతను, ఆధ్యాత్మిక శోభను నింపుతాయి. పోచమ్మ తల్లి దయతో మన మహబూబ్ నగర్ నగరం మరింత అభివృద్ధి దిశగా పయనించాలని కోరుకుంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ రమేష్ బాబు, భరత్, కుమార్, కాంగ్రెస్ నాయకులు, కాలనీ కమిటీ సభ్యులు, మహిళలు శ్రీ పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## ఇన్ స్టా మూసేసిన రుచికా సింగ్

న్యూఢిల్లీ : నాయకులపై సామాజిక మాధ్యమాల్లో తీవ్ర విమర్శలు సాధారణం అయినప్పటికీ, రుచికా సింగ్ అనే 30 ఏళ్ల మహిళ ప్రధాని మోదీపై చేసిన ఒక్క రీల్ ఇప్పుడు సంచలనంగా మారింది. చేసిన తప్పు తెలుసుకుని క్షమాపణ చెప్పినా.. మోదీ తాను క్షమించానని ప్రకటించినా.. ఆ పొరపాటు రుచికా సింగ్‌ను వెంటాడుతూనే ఉంది. ప్రముఖులతో పోల్చి అనుచిత, అసభ్య పదజాలం ఉపయోగించి ప్రసారం చేసిన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేయడంతో ఇప్పుడు ఇన్‌స్టాగ్రామ్ మూసుకోవాల్సి వచ్చింది. చివరకు అజ్ఞాతంలోకి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు కూడా సమాజంలో ఉండే పరిస్థితి తేలుద.రుచికా సింగ్ చేసిన వ్యాఖ్యలు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా అవమానాత్మక శైలిలో ఉన్నాయి. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీతో మోదీకి లింకు పెట్టి మాట్లాడింది. దానిని సోషల్ మీడియాలో పోస్టు చేసింది. పోస్ట్ వైరలవడంతోనే సింగ్ స్వయంగా ఇన్‌స్టాగ్రామ్ ఆపేసి, అజ్ఞాతంలోకి పోయింది. ఆమె తల్లిదండ్రులు కూడా మానసిక ఒత్తిడిని కారణంగా నగరం విడిచి వెళ్లారు.రుచికా సింగ్ వ్యాఖ్యలపై ఇప్పుడు నోయిడా పోలీస్‌స్టేషన్‌లో ఓ మహిళ ఫిర్యాదు చేసింది. మహిళలు తనపైచేసిన వ్యాఖ్యలను పట్టించుకోవడం లేదని, క్షమించానని మోదీ స్వయంగా వీడియో విడుదల చేశారు. కానీ ఫిర్యాదులపై ఎఫ్ఐఆర్ పోలీసులు నమోదు చేస్తున్నారు. నోయిడా పోలీసులు రుచికా సింగ్ కోసం గాలిస్తున్నారు.చదువుకున్న యువత నేతలపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఆందోళన కలిగిస్తున్నాయి. రాజకీయ నాయకులపై అసభ్యగా వ్యాఖ్యానించడం చట్టపరంగా ఆరోజింపబడవచ్చు, కానీ సామాజిక పరిణామాలు మాత్రం వ్యక్తిగత హానికరమైన రీతిలో ఉంటాయి. రుచికా సింగ్ ఒక్క రీల్ ఇప్పుడు ఆమె అజ్ఞాతంలోకి వెళ్లేలా చేసింది. సోషల్ మీడియా ఎంత మేలు చేస్తుందో అంతే ప్రమాదకరం కూడా. ఈ విషయాన్ని యువత గుర్తించాలి.

## రేవంత్ కు హిట్లర్ ఆదర్శం

హైదరాబాద్, ఆగస్టు 4 : హైడ్రా'పై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ మరోసారి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. హైడ్రా అనేది పేదల ఇళ్లను కూలగొట్టి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే ఒక వేధింపుల సంస్థగా మారిందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వానికి అధికారులను నియమించే విచక్షణాధికారం ఉండవచ్చు కానీ, పేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేసే అధికారం మాత్రం లేదని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిట్లర్‌ను ఆదర్శంగా తీసుకుని హైడ్రాను స్థాపించారని ఈటల అన్నారు. నాడు హిట్లర్ ప్రజలను వేధించి తీవ్ర విధ్వంసం సృష్టిస్తే, నేడు రేవంత్ రెడ్డి హైడ్రా ద్వారా తెలంగాణ ప్రజలను అదే రీతిలో వేధిస్తున్నారని ఆరోపించారు. నలభై, యాభై ఏళ్ల క్రితం రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చి చెరువులు, కాలువల పక్కన రెక్కల కష్టం మీద ఇళ్లు కట్టుకున్న పేదల నివాసాలను ఇప్పుడు నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## బాలెంల మల్లిస్వామి కుటుంబానికి అండగా రూ.50 వేల ఆర్థిక సహాయం పంపించిన మంత్రి కోమటిరెడ్డి

యాదాద్రి : యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు పట్టణ కేంద్రానికి చెందిన బాలెంల మల్లిస్వామి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతనికి భార్య ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కు కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ కుటుంబ పరిస్థితిని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మాత్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వారు వెంటనే భావోద్వేగానికి గురై కన్నీరు మున్నీరయ్యారు. తండ్రిని కోల్పోయిన ఆ పిల్లల దుస్థితికి చలించిపోయిన మంత్రి పిల్లల భవిష్యత్తు కొరకు బ్యాంకులో డిపాజిట్ చేయమని రూ.50 వేల ఆర్థిక సహాయంగా పంపించారు. మంగళవారం టీం కోమటిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పంపించిన రూ.50 వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా టీం కోమటిరెడ్డి సభ్యులు మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పార్టీలకతీతంగా నిరుపేదలను ఆదుకునే ఆపద్బాంధవుడని, తన కుమారుడిని కోల్పోయి ఇలా ఎంతో మంది పేదలకు సహాయం చేసి వారి సంతోషాలలో తన కుమారుడిని చూసుకుంటున్న కనిపించే దేవుడని మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## కేంద్రంలో బిజెపి కార్మిక వ్యతిరేక విధానాలకు 4లేబర్ కోడ్స్ రద్దుకు నిరసనగా ఆగస్టు 10న జరిగే జైల్ భరోనుజయప్రదం చేద్దాం

**సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు**

నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి ఆగస్టు 4: నాగర్ కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం లో క్విట్ ఇండియా ఉద్యమస్ఫూర్తితో కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలు కార్పొరేట్ అనుకూల విధానాల నిండగడుతూ గ్రామ గ్రామాన బస్తీలు పారిశ్రామిక నివాస ప్రాంతాల్లో విస్తృతంగా సభలు సమావేశాలు నిర్వహించాలని జైలు బారో కార్యక్రమాన్ని ఆగస్టు పదిన జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతల నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్స్, ఏఎన్ఎం ల తో సమావేశం నిర్వహించి వారికి అచ్చంపేట పట్టణంలో జరిగే జైల్ భరో కార్యక్రమానికి అందరూ హాజరుకావాలని తెలియజేశారు. దేశంలో అంగన్వాడి, ఆశ మధ్యాహ్నం భోజన పథకం ఐకెపి వివో ఏ ఫీల్డ్ అసిస్టెంట్లు ఆరోగ్యశాఖలో వివిధ స్కీం లలో కోటి మంది వర్కర్లు పనిచేస్తున్నారు అన్నారు మీరు ఉద్యోగ భద్రత కనీస వేతనానికి నోచుకునే స్థితి లేదన్నారు లేబర్ కోడ్ సమల్ అయితే తరతరాలుగా పోరాడి సాధించుకున్న హక్కులు కార్మిక వర్గం కోల్పోతారని అన్నారు. నాలుగు లేబర్ కోడ్లను ఉపసంహరించుకునే వరకు పోరాడుదాం అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ గ్యారెంటీ చట్టం మహాత్మా గాంధీ పేరు తొలగించి వికసిత్ భారత్ గ్రామజీ పేరు విబిజి రాంజీగా మార్పు చేయడమే కాక రాష్ట్రాల వాటా 10% నుండి 40% నిధులను భరించాలని నిర్ణయించింది సమైక్య పోరాటం ద్వారా ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవాలన్నారు. పేదలకు అందుతున్న అంత్యోదయ ఆహార భద్రతపై వేటు వేయబడుతుందన్నారు. విద్యుత్ సవరణ బిల్లును వసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ ప్రక్రియకరమైన విద్యుత్ రంగాన్ని ప్రైవేటుకరించడానికి మార్గం సుగమం చేస్తుందన్నారు. దీనిని నిలువరించేందుకు ప్రజలు ఆందోళనలోకి పోరాటాల్లోకి ఉద్యమాల్లోకి రావాలని అన్నారు. దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఆగస్టు 10న జరుగు జైలు వారు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిస్తున్నామన్న అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ ఆర్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం నాయకులు అనూష, రజిత, హేమలత, సాలమ్మ, గెలువమ్మ, బోజమ్మ, వెంకటమ్మ, సంగీత, కేస్ లి, నర్మదా, విజయ ఆశ వర్కర్స్ ఏఎన్ఎం పాల్గొన్నారు.



వేకువ సమయం
బుధవారం 05 ఆగష్టు 2026








# భూత్పూర్ మండల జనరల్ బాడీ సమావేశంలో పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే

**(సమయం ప్రతినిధి దేవరకద్ర):** భూత్పూర్ మున్సిపాలిటీ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య (జనరల్ బాడీ) సమావేశంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (GMR) పాల్గొని అన్ని ప్రభుత్వ శాఖల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, వ్యవసాయం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఉపాధి హామీ, విద్య, వైద్య ఆరోగ్యం, విద్యుత్, హౌసింగ్, మిషన్ భగీరథ, గ్రామీణ నీటి సరఫరా, పశుసంవర్ధక, ఆర్అండ్‌బీ, ఉద్యానవన, ఇరిగేషన్, ఫారెస్ట్, వెటర్నరీ తదితర శాఖల అధికారులు తమ శాఖల పురోగతిని ఎమ్మెల్యేకి వివరించారు. అనంతరం ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యానికి తావు లేకుండా జవాబుదారీతనంతో పనిచేయాలని ఆదేశించారు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో సర్పంచులతో సమన్వయం పెంచి గ్రామస్థాయిలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని, రెవెన్యూ శాఖ భూ సమస్యలు, ప్రజల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడటంతో అడ్మిషన్లు పెరిగాయని పేర్కొంటూ విద్యా రంగంపై ప్రత్యేక శ్రద్ధ కొనసాగుతుందని తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద కొత్త పనులపై సర్పంచులకు అవగాహన కల్పించి, ప్రతి గ్రామంలో అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టాలని సూచించారు, నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు, రాబోయే సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని అవసరమైన మందులను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడంతో పాటు త్వరలో ట్రాన్స్‌ఫార్మర్లు, ఏబీ స్విచ్‌లు, విద్యుత్ పోల్స్ పంపిణీ కార్యక్రమాలను త్వరలో మండలాల వారీగా చేపడతామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, ప్రతి గ్రామంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా నిరంతర నీటి సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు నాణ్యమైన



విత్తనాలు, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని, పశువైద్య సేవలను గ్రామస్థాయిలో మరింత సమర్థవంతంగా అందించాలని చెప్పారు. గ్రామాలు, మండల కేంద్రాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, రోడ్లు, భవనాల నిర్మాణ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించి రైతులకు అవగాహన కల్పించాలని హార్టికల్చర్ శాఖ అధికారులకు సూచించారు. విద్య, వైద్యం, ఇరిగేషన్ వంటి కీలక రంగాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే గారు తెలిపారు, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో



పనిచేసి ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామాభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని పేర్కొంటూ, అధికారులు తమ శాఖలకు సంబంధించి, వాట్సప్ గ్రూపులు క్రియేట్ చేసి ఎప్పటికప్పుడు సర్పంచులకు సమాచారాన్ని తెలియజేయాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు విస్తృతంగా ప్రచారం కల్పించాల్సిన బాధ్యత అధికారులు సర్పంచులపై ఉందని తెలియజేశారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలను వెంటనే అందజేయాలని ఈ సందర్భంగా సర్పంచులను ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# విశ్రాంత ఉద్యోగులను విస్మరిస్తే.... ప్రభుత్వానికి విశ్రాంతి ఇస్తాం




వనపర్తి : ఆర్.టి.సి విశ్రాంత ఉద్యోగుల బస్ భవన్ ముట్టడిని అడ్డుకోవడం ఈ ప్రభుత్వ నిరంకుశత్వానికి పరాకాష్ఠ అని జిల్లా ఆర్.టి.సి విశ్రాంత గౌరవ అధ్యక్షులు వాకిటి.శ్రీధర్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సత్యం,కౌన్సిలర్ భారతి ప్రేమ్ నాథ్ రెడ్డి అన్నారు. విశ్రాంత ఉద్యోగులకు న్యాయంగా రావలసిన బకాయిలు 900కోట్లు వెంటనే విడుదల చేయాలని ఈరోజు బస్ భవన్ ముట్టడికి ప్రజాస్వామ్యయుతంగా పిలుపునిస్తే కనీసం మా ఆవేదనను వినిపించుకోకుండా వయో వృద్ధులం అని చూడకుండా అక్రమ అరెస్టులు చేయడం ఈ ప్రభుత్వ చేతకాని తనాన్నికి నిదర్శనం అని వాపోయారు. 2017 నుండి రావలసిన ఆర్.బి.ఎస్ బకాయిలు, గ్రాట్యుటీ బకాయిలు,పెన్షన్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఒక్కరికి 15లక్షల నుండి 20లక్షల బకాయిలు రావాలని మా పిల్లల ఉన్నత చదువుల కోసం,పెండిల్లల కోసం దాచుకున్న మా సొమ్ము మాకు ఇవ్వాలని కోరుతుంటే మమ్మల్ని అణిచివేయడం ఈ ప్రభుత్వానికి తగదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో మా కోరికలన్నీ అధికారంలోకి వచ్చిన వెంటనే తీర్చుతామని చెప్పి మమ్మల్ని మోసం చేయటం దుర్మార్గ చర్యగా అభివర్ణించారు. బి.ఆర్.ఎస్ హయాములో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాకు అండదండగా నిలిచారని మాకు ఎటువంటి ఆపద వచ్చినా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి మా సమస్యలు పరిష్కరించారని మాకు నూతన విశ్రాంతి భవనం నిర్మించి వసతి కల్పించారని అదేవిధంగా మాజీ వైస్ చైర్మన్ వాకిటి.శ్రీధర్,ప్రస్తుత కౌన్సిలర్ భారతి ప్రేమ్ నాథ్ రెడ్డి సహకారం మరువలేనిది అని మా అరెస్టు సమయములో మాకు అండగా నిలిచారని వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మా బకాయిలు మాకు వెంటనే చెల్లించాలని లేకపోతే ఈ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వాకిటి.శ్రీధర్,సత్యన్నా,ప్రేమ్ నాథ్ రెడ్డి, రామచంద్రారెడ్డి, అంజయ్య, ఉపేందర్,ప్రకాష్,సత్యనారాయణ గౌడ్,హుసేన్ అలీ,స్వామి, రాఘవరెడ్డి, బి.వి.రావ్, గాంధీ, కురుమయ్య,రామ్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# వనస్థలిపురం ఆటోనగర్‌లో చేనేత పారిశ్రామిక సహకార సంఘాల పాలకుల ఘనంగా అభినందన సభ

హైదరాబాద్ : హైదరాబాద్‌లోని వనస్థలిపురం ఆటోనగర్లో చేనేత పారిశ్రామిక సహకార సంఘాల పాలకుల అభినందన సభ ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన చేనేత సహకార సంఘాల ఎన్నికల్లో విజయం సాధించిన పాలకవర్గ సభ్యులను రాష్ట్ర పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో శాలువా కప్పి, మెమెంటో అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అమరచింత చేనేత సహకార సంఘం అధ్యక్షుడు తిరుమల రఘురాం, ఉపాధ్యక్షుడు పారుపల్లి గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి మేర్వ అనిల్, కోశాధికారి మ్యాడమ్ కృష్ణయ్య, డైరెక్టర్ వగ్గు వెంకటేష్లను శాలువా కప్పి, మెమెంటోతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, చేనేత రంగ అభివృద్ధికి నూతన పాలకవర్గం సమిష్టిగా కృషి చేసి, నేతన్నల సంక్షేమం కోసం విశేషంగా పనిచేయాలని ఆకాంక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి సేవలు చేనేత రంగ అభివృద్ధికి మరింత దోహదపడాలని ఆకాంక్షించారు.



# మెట్రో రైల్ ప్రాజెక్ట్ పనుల్లో కీలక ముందడుగు

విజయవాడ : అమరావతి రాజధాని ప్రాంతంలో ప్రజారవాణా వ్యవస్థను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్ట్ పనుల్లో మరో కీలక ముందడుగు పడింది. ప్రాజెక్ట్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు సంబంధిత అధికారులు సోషల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ సర్వేను అధికారికంగా ప్రారంభించారు. భూసేకరణ వల్ల స్థానిక ప్రజలు, వ్యాపార సంస్థలపై పడే ప్రభావాన్ని శాస్త్రీయంగా అంచనా వేసి, వారికి తగిన పరిహారం , పునరావాసం కల్పించడమే ఈ సర్వే ప్రధాన ఉద్దేశం. దీనికి సంబంధించి త్వరలోనే ప్రభావిత ప్రాంతాల ప్రజలతో రౌండ్ టేబుల్ సమావేశాలు, బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించేందుకు షెడ్యూల్ సిద్ధం చేస్తున్నారు. విజయవాడ మెట్రో మొదటి విడత నిర్మాణంలో భాగంగా రెండు ప్రధాన కారిడార్లను ప్రతిపాదించారు. మొదటి కారిడార్ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ నుండి గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం వరకు విస్తరించి ఉండగా.. రెండో కారిడార్ ఖజౌహ నుండి పెనమలూరు వరకు సాగనుంది. ఈ రెండింటికీ ప్రధాన రవాణా కేంద్రమైన పండిట్ నెహ్రు బస్ స్టుషన్ వద్దే రెండు ప్రత్యేక మెట్రో స్టేషన్లను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నగరం నడిబొడ్డున ఉన్న బస్ స్టేషన్, రైల్వే స్టేషన్లతో పాటు గన్నవరం ఎయిర్‌పోర్టును మెట్రో ద్వారా అనుసంధానించడం వల్ల ప్రయాణికులకు సత్వర , సునాయాస రవాణా వసతి లభించనుంది. గతంలో నిలిచిపోయిన ఈ మెట్రో ప్రాజెక్ట్‌ను మళ్లీ పట్టాలెక్కించేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తుండటంతో విజయవాడ , అమరావతి పరిసర ప్రాంతాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రాజెక్ట్‌కు అవసరమైన అనుమతులు, డిజైన్లు , భూసేకరణకు సంబంధించిన పనులు సమాంతరంగా జరుగుతుండటం ప్రాజెక్ట్ అమలుపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని స్పష్టం చేస్తోంది. సోషల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ , ప్రజాభిప్రాయ సేకరణ పూర్తయిన వెంటనే భూసేకరణ తుది ప్రక్రియ ప్రారంభమై, విజయవాడ మెట్రో నిర్మాణ పనులు క్షేత్రస్థాయిలో ప్రారంభం కానున్నాయి.

# సోంపురం అంగన్వాడీ కేంద్రంలో సామూహిక అన్నప్రాశన కార్యక్రమం



సమయం ప్రతినిధి: జోగులాంబ గద్వాల జిల్లా  గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలం నందిన్నె సెక్టార్ పరిధిలోని సోంపురం అంగన్వాడీ కేంద్రంలో సామూహిక అన్నప్రాశన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులకు సంప్రదాయ పద్ధతిలో అన్నప్రాశనం చేయించి, తల్లిదండ్రులకు శిశు పోషణ, పరిశుభ్రత, సమతుల్య ఆహారం, తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించిన అంగన్వాడి టీచర్ గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులు మరియు గ్రామ మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నైట్ వాచ్‌మెన్ ముజీబ్ కుటుంబానికి ఆర్థిక సాయం



పెబ్బేరు :ఆగస్టు 04(సమయం ప్రతినిధి): పెబ్బేరు మున్సిపల్ పట్టణంలోని 11వ వార్డులో నివసిస్తున్న ముజీబ్  ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో (నైట్ వాచ్‌మెన్) మృతి చెందడం పట్ల స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. ముజీబ్ గత 20 సంవత్సరాలుగా ప్రభుత్వ ఆసుపత్రిలో నైట్ వాచ్‌మెన్‌గా తన సేవలను అందిస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా సోమవారం రాత్రి , మంగళవారం ఉదయం ప్రభుత్వ హాస్పిటల్ లోనే ఆయనకు గుండెపోటు రావడంతో తుదిశ్వాస విడిచారు. ఈ విషయం తెలుసుకున్న మండల వైద్యాధికారి డాక్టర్ రాకేష్ రెడ్డి, వైద్య సిబ్బంది, అలాగే గతంలో ఇక్కడ పనిచేసిన వైద్యులు ముజీబ్ నివాసానికి చేరుకుని ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది, పూర్వ వైద్యులు స్వచ్ఛందంగా సేకరించిన రూ. 36,000/- రూపాయలు (నగదు) ఆర్థిక సాయాన్ని ముజీబ్ కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాకేష్ రెడ్డి మాట్లాడుతూ... "ముజీబ్ ఆసుపత్రికి అందించిన సేవలు మరువలేనివి. ఆయనది చాలా పేద కుటుంబం. నిరుపేద కుటుంబంలో సంపాదించే వ్యక్తి చనిపోవడం తీరని లోటు. ప్రభుత్వం కూడా స్పందించి వారి కుటుంబాన్ని ఆదుకోవాలి" అని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ రాకేష్ రెడ్డితో పాటు ఆసుపత్రి వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు స్థానికులు పాల్గొన్నారు.

# హాస్టల్ లో విద్యార్థినులకు అస్వస్థత

మచిలీపట్నం : మచిలీపట్నంలో లేడీస్ హాస్టల్ లో ఆరుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. నలతగా ఉందని చెప్పడంతో విద్యార్థినులకు ఇంజెక్షన్ ఇచ్చినట్లు సమాచారం.. ఇంజెక్షన్ ఇచ్చిన తరువాత కాళ్లు, చేతులు బిగుసుకుపోతున్నట్లు  విద్యార్థినులు హాస్టల్ సిబ్బంది కి ఫిర్యాదు చేసారు. వారిని అధికారులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు పర్యవేక్షణ చేస్తున్నారు. అస్వస్థతకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

# జూరాల ప్రాజెక్టు నీటితో పూర్తిస్థాయిలో ఆయకట్టుకు సాగునీరు





వరద నీటిని సద్వినియోగం చేసుకోవాలి.
జూరాల కుడి కాలువ ద్వారా ఆర్డీఎస్ లింక్ కెనాల్స్ కు నీటిని మళ్ళించాలి.
వేసవిలో తాగునీటి కొరత లేకుండా ప్రణాళిక అవసరం.
కాలువలు, ఇతర మరమ్మత్తుల పనులు వేసవిలోనే పూర్తి చేయాలి.
జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.
జూరాల ప్రాజెక్టును సందర్శించిన కలెక్టర్

**సమయం ప్రతినిధి:** జోగులాంబ గద్వాల జిల్లా జూరాల ప్రాజెక్టు పరిధిలో చేపట్టిన జిల్లాలోని వివిధ ఎత్తిపోతల పథకాలతో ప్రస్తుతం వస్తున్న వరద నీటితో అన్ని రిజర్వాయర్లను నింపుకోవడంతో పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీటిని అందించవచ్చని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం ధరూర్ మండలంలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టును జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మ్యాపును, వివిధ రిజిస్టర్ లను పరిశీలించారు. కర్ణాటక ప్రాజెక్టుల నుంచి కొద్దిరోజులుగా కృష్ణా నదికి పెద్ద ఎత్తున వరద వస్తుండడంతో జూరాల ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం, గేట్ల ద్వారా దిగువకు వదులుతున్న, ఎత్తిపోతల పథకాలకు, సమాంతర కాలువలకు వినియోగిస్తున్న వరద నీటి, తదితర వివరాలను సంబంధిత ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్ట్ గేట్లను పరిశీలించిన కలెక్టర్ అక్కడి యంత్రాల పనితీరు, సిబ్బంది వివరాలను అడిగారు. పవర్ హౌస్ నుంచి ఉత్పత్తి అయ్యే జలవిద్యుత్ గురించి అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూరాల కుడి కాలువ లైనింగ్ మరమ్మత్తులు, ఇతర పనులను వేసవిలోనే పూర్తి చేయాలని చివరి ఆయకట్టుకు కూడా సాగునీరు అందాలంటే కాలువల నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు ప్రాజెక్టుల నిర్వహణకు వచ్చే నిధులను ఎప్పటికప్పుడు సద్వినియోగం చేసుకుంటే ఎలాంటి సమస్య ఉండదన్నారు. జూరాల కుడికాలువ ద్వారా ఆర్డిఎస్ పరిధిలోని లింక్ కెనాల్స్ కు నీటిని మళ్లించేందుకు ప్రయత్నించాలని, ఫలితంగా అలంపూర్ నియోజకవర్గంలోని వివిధ మండలాల రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నందున రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నప్పటికీ కాలువల పరిధిలోని రైతులు ప్రస్తుతం నీటిని విడుదల చేస్తుండడంతో వరి సాగు చేసే అవకాశం ఉందన్నారు. వరి పండించే రైతుల పంటలు చేతికొచ్చే వరకు కాలువల ద్వారా వరి సాగుకు నీటి లభ్యత గురించి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. గద్వాల నియోజకవర్గ పరిధిలోని గూడెం దొడ్డి, ర్యాలంపాడు, తదితర రిజర్వాయర్లను ప్రస్తుతం వస్తున్న వరద నీటితో పూర్తి స్థాయిలో నింపుకోవాలని సూచించారు. వేసవిలో తాగునీటి సమస్యలు ఉత్పన్నం అవ్వకుండా ప్రణాళికతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. జూరాల గేట్లు తెరవడంతో సెలవు రోజుల్లో పెద్ద ఎత్తున పర్యాటకులు వస్తున్నందున వంతెనపై ట్రాఫిక్ జామ్ సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. సందర్శకులు ఘాట్ల వద్ద నీళ్లలోకి దిగకుండా రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇరిగేషన్ రహదారుల అభివృద్ధికి ఆర్ అండ్ బి ఆధ్వర్యంలో మరమ్మత్తులు చేయించేందుకు ఇటీవల జిల్లాలో పర్యటించిన రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించినందున సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో నిర్మాణంలో ఉన్న వివిధ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ వేగవంతం చేయాలని, ఆర్ అండ్ ఆర్ కేంద్రాల్లో నివసిస్తున్న ప్రజలకు పూర్తిస్థాయిలో సదుపాయాలను కల్పించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో నీటిపారుదల శాఖ ఎస్ఈ కేశవరావు, డిఈ నాగేశ్వరరావు, తహసిల్దార్ నందిని, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జనం కోసం అనునిత్యం జనం మధ్యలో ఉండే నిజమైన నాయకుడు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



దేవరకొండ: ఆగస్టు 4 (సమయం ప్రతినిధి) : ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, వారి కష్టసుఖాల్లో భాగస్వాములవుతూ, ప్రజాసేవనే పరమావధిగా భావించే నాయకుడు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్. అధికారంలో ఉన్నా, లేకపోయినా ప్రజలకు అందుబాటులో ఉంటూ, గ్రామాలు, తండాలు, పట్టణాల్లో నిరంతరం పర్యటిస్తూ ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజల అభిమానాన్ని చూరగొంటున్నారు. ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి, యువతకు ప్రోత్సాహం, రైతులు, మహిళలు, పేదల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం సేవలందిస్తూ నిజమైన ప్రజానాయకుడిగా నిలుస్తున్నారు. ప్రజలతో మమేకమై, ప్రజల కోసం అనునిత్యం ప్రజల మధ్యలో ఉంటూ సేవాభావంతో ముందుకు సాగుతున్న రమావత్ రవీంద్ర కుమార్ కి ప్రజలు ఎల్లప్పుడూ అండగా నిలుస్తారని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## గట్టు ఎంఆర్ఓ కార్యాలయంలో అటెండర్‌తో వెట్టిచాకిరి?



సమయం ప్రతినిధి: జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల జిల్లా గట్టు మండల తహసీల్దార్ (ఎంఆర్ఓ) కార్యాలయంలో అటెండర్‌తో వెట్టిచాకిరి చేయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లతో పాటు ఇతర ఉద్యోగులు ఉపయోగించిన ( తిన్న) టిఫిన్ బాక్సులను అటెండర్‌తో కడిగిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ ఉద్యోగుల వ్యక్తిగత పనులు చేయించడం, టిఫిన్ బాక్సులు శుభ్రం చేయించడం వంటి పనులు అటెండర్ విధుల్లో భాగం కాదని ఉద్యోగ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇటువంటి చర్యలు ఉద్యోగి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తాయని, కార్యాలయాల్లో పనుల కేటాయింపు నిబంధనలకు విరుద్ధమని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి, ఆరోపణలపై విచారణ జరిపి నిజానిజాలు వెలికితీయడంతో పాటు, వాస్తవాలు తేలితే బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## కరెంటు షాక్‌తో ఆవు మృతి

### రైతుకు రూ.80 వేల నష్టం

ఉప్పునుంతల ఆగస్టు 4: నాగర్ కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధిలోని దాసర్లపల్లి గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఎల్లికంటి చిన్నయ్యకు చెందిన ఆవు మంగళవారం సాయంత్రం ప్రమాదవశాత్తు కరెంటు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది.మృతిచెందిన ఆవు విలువ సుమారు రూ.80 వేల వరకు ఉంటుందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనతో ఎల్లికంటి చిన్నయ్యకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లిందని గ్రామస్థులు పేర్కొన్నారు. పాడి పశువుపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న కుటుంబానికి ఇది తీవ్ర దెబ్బగా మారిందన్నారు. సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు, పశుసంవర్ధక శాఖ అధికారులు ఘటనాస్థలాన్ని పరిశీలించి, నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వ నిబంధనల మేరకు బాధిత రైతుకు తగిన పరిహారం అందించాలని గ్రామస్థులు కోరారు.

## తిరుగుబాటుకు సిద్ధమతున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

అదిలాబాద్, ఆగస్టు 4:అటవీశాఖ అధికారులు తమ తీరు మార్చుకోవాలని, 24 గంటల్లో వారిపై చర్యలు తీసుకోకపోతే ఉద్యమానికి సైతం సిద్ధమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ హెచ్చరించారు. అటవీశాఖ ఉద్యోగులకు వ్యతిరేకంగా ఖానాపూర్ నియోజకవర్గంలోనే ఒక వ్యతిరేక సామ్రాజ్యం ఏర్పాటు చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివాసీలపై దాడి చేసిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేసిన ఆయన... అవసరమైతే సహాయ నిరాకరణ ఉద్యమానికి కూడా శ్రీకారం చుడతామని హెచ్చరించారు. మంచిర్యాల జిల్లా జన్నారంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ... ఆదివాసీలపై చేయి చేసుకున్న ఇంధన్ పల్లి రేంజ్ అధికారి లక్ష్మీనారాయణను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే తపాలాపూర్, ఉడుంపూర్, ఖానాపూర్ రేంజ్ అధికారులపైనా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అటవీశాఖ అధికారులు తమ వైఖరి మార్చుకోకపోతే కవ్వాల్ టైగర్ జోన్ ప్రారంభమైన జన్నారం నుంచే అటవీశాఖకు వ్యతిరేక ఉద్యమానికి పునాది వేస్తామని హెచ్చరించారు.

## గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం - ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

దేవరకొండ: గుడిపల్లి: ఆగస్టు 4 (సమయం ప్రతినిధి) : దేవరకొండ నియోజకవర్గం, గుడిపల్లి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం భవనాన్ని సంబంధిత అధికారులతో కలిసి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి భవనంలోని వివిధ విభాగాలను పరిశీలించి వైద్య సేవలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్. మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలను వారి ఇంటి వద్దకే చేరవేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి. నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోగ్య రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతం, మౌలిక వసతుల కల్పన, అవసరమైన వైద్య సిబ్బంది నియామకం, ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటు వంటి చర్యల ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. గుడిపల్లి ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం అందుబాటులోకి రావడం వల్ల మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందుతాయని తెలిపారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ఈ కేంద్రం ద్వారా సులభంగా వైద్య సేవలు పొందవచ్చని అన్నారు. సాధారణ ఆరోగ్య పరీక్షలు, తల్లి-శిశు సంరక్షణ, టీకాలు, రక్తపోటు, మధుమేహ పరీక్షలు, ప్రాథమిక చికిత్స, అవసరమైన మందులు వంటి సేవలను ప్రజలు పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలు చిన్న ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య ఉపకేంద్రానికే వచ్చి చికిత్స పొందాలని, ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు మరింత విశ్వాసం పెరిగేలా సేవలు అందించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బందిని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగిని ఆప్యాయంగా, మర్యాదపూర్వకంగా పలకరించి, మానవత్వంతో సేవలు అందించాలని సూచించారు. ముఖ్యంగా పేద ప్రజలు, వృద్ధులు, గర్భిణీలు, అత్యవసర పరిస్థితుల్లో వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో నాణ్యమైన



వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చే ప్రతి ఒక్కరికి ఆత్మీయత, గౌరవం, నమ్మకం కలిగే విధంగా వ్యవహరించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య రంగ అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వానికి అత్యంత విలువైన సంపద అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. దేవరకొండ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి మెరుగైన వైద్య, విద్య, రహదారులు, తాగునీరు వంటి మౌలిక వసతులు కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, జిల్లా పార్టీ నాయకులు, వైద్యులు మరియు సిబ్బంది, సర్పంచులు, మండల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులు, గ్రామ పెద్దలు, పార్టీ కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## తెలంగాణకు వాతావరణ శాఖ హెచ్చరిక పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్‌లు

## రాబోయే మూడు రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు

హైదరాబాద్, ఆగస్టు 4 : తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరించింది. సముద్ర మట్టం వద్ద రుతుపవన ద్రోణి ప్రభావంతో వర్షాలు కురుస్తాయని చెప్పారు. ఈ మేరకు కామారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, మెదక్, సంగారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. అలాగే హైదరాబాద్ సహా 18 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ అయింది. వర్షాలతో పాటు గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు, రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.తెలంగాణ వ్యాప్తంగా రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. ప్రస్తుతం సముద్ర మట్టం వద్ద ఉన్న రుతుపవన ద్రోణి బికనేర్, ఢిల్లీ, లక్నో, పాట్నా మీదుగా మణిపూర్ వరకు వ్యాపించి, సముద్ర మట్టానికి సుమారు 0.9 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందన్నారు. అదే సమయంలో, ఉత్తర కర్ణాటక నుంచి దక్షిణ కర్ణాటక, కేరళ, తమిళనాడు మీదుగా కొమొరిన్ ప్రాంతం వరకు విస్తరించి ఉన్న మరొక ద్రోణి ప్రస్తుతం బలహీనపడింది. ఈ వాతావరణ మార్పుల ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని అధికారులు స్పష్టం చేశారు.వాతావరణ పరిస్థి తీవ్రతను బట్టి వాతావరణ శాఖ వివిధ జిల్లాలకు హెచ్చరికలను జారీ చేసింది. ముఖ్యంగా కామారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, మెదక్, సంగారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఈ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. వర్షం కురిసే సమయంలో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని అన్నారు. వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడం, చెట్ల కొమ్మలు విరిగిపడే అవకాశం ఉన్నందున ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.మరోవైపు, హైదరాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, కుమురం భీమ్ ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, ములుగు, నల్గొండ, నారాయణపేట, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సిద్ధిపేట, సూర్యాపేట, వికారాబాద్, వరంగల్, యాదాద్రి భువనగిరి జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఈ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందన్నారు. అలాగే గంటకు 40 కిలోమీటర్ల లోపు వేగంతో ఈదురుగాలులు వీచే సూచనలు ఉన్నాయని వాతావరణ శాఖ స్పష్టం చేసింది.ఈ వర్షాల దృష్ట్యా వాహనదారులు, ముఖ్యంగా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు జాగ్రత్త వహించాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. భారీ వర్షాలు, ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో చెట్ల కింద గానీ, విద్యుత్ స్తంభాల వద్ద గానీ నిలబడకూడదని సూచించారు. పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు మెరుపుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అత్యవసర పనులు ఉంటే తప్ప ప్రజలు బయటకు రాకుండా ఉండడం మంచిదని జీహెచ్ఎంసీ, స్థానిక యంత్రాంగాలు అప్రమత్తం చేశాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలకు తగిన సహాయక చర్యలు అందించేందుకు విపత్తు నిర్వహణ బృందాలను కూడా సిద్ధంగా ఉంచారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీకి అర్హులను పారదర్శకంగా గుర్తించాలి

కరీంనగర్ : డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కోసం లబ్ధిదారుల ఎంపికను పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియలో అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేపట్టాలని సూచించారు.మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జమ్మికుంట, హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్లతో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ. అర్హులకు ఎలాంటి అన్యాయం జరగకుండా ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఒక్కో దరఖాస్తును కనీసం రెండుసార్లు పరిశీలించి, అర్హత ప్రమాణాల ప్రకారమే నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. సరైన కారణం లేకుండా ఏ ఒక్క దరఖాస్తును తిరస్కరించవద్దని సూచించారు. ప్రతి వార్డులో క్షేత్రస్థాయికి వెళ్లి దరఖాస్తుదారుల వివరాలను ప్రత్యక్షంగా పరిశీలించి, పారదర్శకంగా అర్హుల జాబితాను సిద్ధం చేయాలని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ ప్రక్రియను నిష్పక్షపాతంగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.సమావేశంలో జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామి మాట్లాడుతూ, తమ మున్సిపాలిటీ పరిధిలో అర్హుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ కిషన్ మాట్లాడుతూ, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

**యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడడం మన అందరి బాధ్యత**
**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**







**నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి ఆగస్టు 4 :** నాగర్‌కర్నూలు జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, గంజాయి వంటి మత్తు పంటల అక్రమ సాగు నియంత్రణ, యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా అవసరమైన చర్యలను అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నాగర్‌కర్నూలు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, తో కలసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధ్యక్షతన జిల్లా స్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ (NCORD) కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...., జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలు, వినియోగంపై సంబంధిత శాఖలు నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. గంజాయి, వంటి మత్తు పంటల అక్రమ సాగు ఎక్కడైనా గుర్తించిన వెంటనే చట్టపరమైన చర్యలు చేపట్టాలని, అంతర్రాష్ట్ర మాదకద్రవ్యాల అక్రమ రవాణా కేసుల్లో సమాచార మార్పిడి, సమన్వయం మరింత బలోపేతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో పోలీసు, విద్య, వైద్య, ఎక్సైజ్ తదితర శాఖలు పరస్పర సహకారంతో పనిచేయాలని సూచించారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని, సంబంధిత శాఖలు సమిష్టి బాధ్యతతో చర్యలు చేపట్టాలని, యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థల్లో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యపరమైన దుష్పరిణామాలు, కుటుంబాలపై వాటి ప్రభావం, ఎన్‌డీపీఎస్ (NDPS) చట్టం నిబంధనలు, చట్ట ప్రకారం విధించే కఠిన శిక్షలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. మత్తు పంటల సాగు ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు డ్రగ్స్ గుర్తింపునకు అవసరమైన పరికరాల వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని, జిల్లాలోని డీ-అడిక్షన్ (వ్యసన విముక్తి) మరియు పునరావాస కేంద్రాల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ వ్యసన బాధితులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖ నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ, సున్నితమైన ప్రదేశాలలో సమర్థవంతమైన నిఘాతో డ్రగ్స్ నిర్మూలనకు చ్యరలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పాఠశాలల్లో, కాలేజీల పై ప్రత్యేక నిఘాతో పర్యవేక్షించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు అన్ని శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి, డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు సమిష్టిగా పనిచేయాలని, అక్రమ రవాణాపై నిరంతర నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మాదకద్రవ్యాల నియంత్రణలో ప్రభుత్వ యంత్రాంగంతో పాటు విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజల భాగస్వామ్యం కూడా అత్యంత కీలకమని, మాదకద్రవ్యాల నిర్మూలన ఒక శాఖ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని అన్ని వర్గాలు సమిష్టిగా కృషి చేసినప్పుడే ఆశించిన ఫలితాలు సాధించగలమని, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ మాట్లాడుతూ....., జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం అన్ని సంబంధిత శాఖలతో సమన్వయం పెంచుకుంటూ పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలు, వినియోగాన్ని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు నిరంతర నిఘా కొనసాగిస్తున్నామని, డ్రగ్స్ మాఫియాపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థల్లో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలకు చైతన్యం కల్పిస్తున్నామని తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలు వెంటనే పోలీసులకు అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని, జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసు, ఎక్సైజ్, అటవీ, విద్య, వైద్య, వ్యవసాయ తదితర శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడం, యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడడం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవడం లక్ష్యంగానే జిల్లా స్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ కమిటీ సమావేశంలో నిర్ణయించిన అంశాలను పరిగణనలోకి తీసుకుని చర్యలు తీసుకుంటామనిజిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ తెలిపారు. ఈ సమావేశంలో, అదనపు కలెక్టర్లు చెన్నయ్య దేవ సహాయం, అదనపు ఎస్పి వెంకటేశ్వర్లు,జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్, అన్ని సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

---

# త్రిష్‌పై అసభ్యకర వ్యాఖ్యలు ఉదయనిధి అరెస్ట్.. విడుదల

చెన్నై, ఆగస్టు 4 : తమిళనాడు రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. డీఎంకే, ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ అరెస్టు చేశారు. త్రిషపై చేసిన అసభ్యకరమైన వ్యాఖ్యలతో తమిళనాడు వివిధ ప్రాంతాల్లో కేసులు నమోదు అయ్యాయి. దీన్ని పరిగణలోకి తీసుకున్న పోలీసులు ఆయన అరెస్టు చేశారు. చెన్నైలో ఆయన్ని అరెస్టు చేసి తంజావూరు తరలిస్తున్నారు. అయితే ఆయన ఇంటి చుట్టూ భారీగా డీఎంకే కార్యకర్తలు మోహరించి ఉండటంతో ఆయన్ని బయటకు తీసుకురావడానికి సమయం పట్టింది. మరోవైపు ఈ కేసులపై అత్యవసర విచారణ చేపట్టి ముందస్తు బెయిల్ కోసం ఉదయనిధి స్టాలిన్ తరఫున లాయర్లు ట్రై చేస్తున్నారు. దీంతో ఆయన నివాసం వద్ద హైడ్రామా కొనసాగుతోంది. ఆగస్టు3న తంజావూరులో కావేరీ నీటి పంపకాల వివాదంపై డీఎంకే ఆధ్వర్యంలో ఒక భారీ ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉదయనిధి స్టాలిన్ రాష్ట్ర ప్రభుత్వంపై, సీఎం విజయ్‌పై విమర్శలు చేశారు. తమిళనాడుకు రావాల్సిన కావేరీ నీటిని సాధించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఈ ప్రసంగం సాగుతుండగానే అక్కడకు వచ్చిన డీఎంకే కార్యకర్తలు త్రిష త్రిష అని నినాదాలు చేశారు. ఆ సమయంలో ఉదయనిధి స్టాలిన్ తన ప్రసంగాన్ని కాసేపు ఆపి, నవ్వు చేసిన డబుల్ మీనింగ్ డైలాగ్ వివాదాన్ని రేపింది. ఈ వ్యాఖ్యలు మహిళలను కించపరిచేలా, అత్యంత అసభ్యకరంగా ఉన్నాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఉదయనిధి వ్యాఖ్యలపై తక్షణమే స్పందించిన టీవీకే, బీజేపీ, కాంగ్రెస్ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తంజావూరు పోలీసులు ఉదయనిధిపై ఆరు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ ఉదయం జాయింట్ కమిషనర్ విజయ్ కుమార్ నేతృత్వంలోని పోలీసు టీం నీలాంగరైలోని ఉదయనిధి నివాసానికి చేరుకుంది. పోలీసులు ఆయన ఇంటికి చేరుకున్న సమయంలో డీఎంకే కార్యకర్తలు భారీగా తరలి వచ్చారు. చట్టపరంగా ఉదయనిధిని అరెస్టు చేసేందుకు వచ్చామని పోలీసులు ఆయన భార్యకు సమాచారం అందించారు. తమకు కొంచెం సమయం కావాలని ఆమె అడిగినట్టు ప్రచారం జరుగుతోంది. అక్కడే ఉన్న మాజీ మంత్రి సుబ్రమణియన్ పోలీసులతో మాట్లాడారు. దీనిపై హైకోర్టులో విచారణ సాగుతుందని కూడా వివరించారు. అయితే అరెస్టు చేస్తున్నామని పోలీసులు చెప్పడంతో ఆయన కార్యకర్తలను శాంతిపజేసే ప్రయత్నాల్లో ఉన్నారు. ఉదయనిధిని తంజావూరు తరలించే ఛాన్స్ ఉంది. రేపు తమిళనాడు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న టైంలో ఈ అరెస్టు రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీసింది. ఉదయనిధి వ్యాఖ్యలు టీవీకే నేతలు తీవ్రంగా ఖండించారు. టీవీకే నాయకుడు ఆధవ్ అర్జున్ ఇన్‌స్టాగ్రామ్ వేదికా స్పందిస్తూ, ఉదయనిధి అశ్లీలనిధి అని సంబోధించారు. అన్నాదురై లాంటి మహానుభావులు నిర్మించిన రాజకీయ సంస్కృతిని ఉదయనిధి తన అసభ్యకర భాషతో నాశనం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. మహిళల పట్ల ఉదయనిధికి ఉన్న వికృత ఆలోచనలు ఈ వ్యాఖ్యల్లో బయటపడ్డాయని, తమిళనాడులోని ఏ తల్లి, సోదరి ఇలాంటి భాషను సహించదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వివాదం కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాలేదు. టీవీకే పార్టీ జాతీయ మహిళా కమిషన్‌కు అధికారికంగా ఫిర్యాదు చేసింది. ఒక ప్రముఖ మహిళా నటిని ఉద్దేశించి బహిరంగ వేదికపై ఉదయనిధి చేసిన వ్యాఖ్యలు మహిళలను వస్తువులుగా చూడడాన్ని, వేధింపులను ప్రోత్సహించేలా ఉన్నాయని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై సుమోటోగా స్పందించి ఉదయనిధికి నోటీసులు జారీ చేయాలని టీవీకే మహిళా కమిషన్‌ను కోరింది. మరోవైపు ఈ కేసుపై మద్రాస్ హైకోర్టులో ఉదయనిధి స్టాలిన్ తరఫున పిటిషన్ దాఖలు చేశారు. తదుపరి చర్యలు చేపట్టకుండా ఊరట కల్పించాలని పిటిషన్‌లో వెల్లడించారు. దీనిపై అర్జెంట్‌గా విచారణ చేపట్టాలని అభ్యర్థించారు. దీనిపై విచారణ చేపట్టేందుకు సమయం కావాలని అప్పటి వరకు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కానీ అప్పటికే పోలీసులు ఉదయనిధి స్టాలిన్ ఇంటికి వెళ్లి ఆయన్ని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తంజావూరు స్టేషన్‌కు తరలించారు. అడ్డుకునేందుకు యత్నించిన డీఎంకే శ్రేణులను అదుపు చేశారు. కోర్టులో ఉదయనిధి స్టాలిన్ పిటిషన్‌పై మద్రాస్ హైకోర్టు విచారించింది. అరెస్టు విషయాన్ని ఆయన తరఫున లాయర్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే కోర్టు జోక్యం చేసుకొని విడుదల చేయాలని ఆదేశించింది. పోలీసులు చేపట్టే విచారణకు సహకరించాలని ఉదయనిధి స్టాలిన్‌కు చెప్పింది. అయితే ఎఫ్ఐఆర్ నమోదు అయిన కేసులో విచారణ చేస్తున్నామని, అయిన వెంటనే విడుదల చేస్తామని పోలీసులు కోర్టుకు తెలియజేశారు. కోర్టు ఆదేశాల మేరకు ఉదయనిధి విచారణ పూర్తి చేసుకున్న తర్వాత విడుదల అయ్యే ఛాన్స్ ఉంది. మరోవైపు ఆయనను అదుపులోకి తీసుకోవడంపై డీఎంకే శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విజయ్ దిష్టిబొమ్మలను తగులబెడుతున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు. త్రిష పేరు ప్రస్తావించకపోయినా రాజకీయ కక్షపూరితంగానే ఉదయనిధిని అరెస్టు చేశారని మండిపడుతున్నారు.

**ఉదయనిధి కామెంట్స్ ఏంటీ**

కావేరీ జలాల కోసం చేపట్టిన నిరసన కార్యక్రమంలో ప్రసంగించిన తమిళనాడు ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ త్రిషపై అభ్యంతరకరమైన భాషను ప్రయోగించారు. ఆమె పేరు ప్రస్తావించకపోయినా ఆమెను ఉద్దేశించి చేసిన కామెంట్స్ సంచలనంగా మారాయి. దీనిపై ఆగ్రహించిన టీవీకే నేతలు ఉదయనిధిపై ఫిర్యాదులు చేశారు. తంజావూరులో ఫిర్యాదును పరిగణలోకి తీసుకున్న పోలీసులు ఆయన్ని అరెస్టు చేశారు. కావేరీ సమస్య గురించి మాట్లాడటం మొదలుపెట్టిన వ్యక్తి, తమిళనాడు ముఖ్యమంత్రితో పోరాడే ధైర్యం లేక, అందరి ముందు ఆయన గురించి అమర్యాదగా, అసభ్యంగా మాట్లాడారు. బూతు మాటలు వాడారు. పై నిరసనలో ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ, "మాకు మొత్తం 42 టీఎంసీల నీరు రావాలి, కానీ ఈ రోజు ఒక్క చుక్క నీరు కూడా రాలేదు. ఇక్కడ ఉన్న ముఖ్యమంత్రి దీని గురించి మాట్లాడతారా? ఆయన మాట్లాడారు.

## బిజెపి ప్రజా వ్యతిరేక పాలనను నిరసించండి

**సిపిఐ జిల్లా కార్యదర్శి కె. విజయ రాములు**

అమరచింత, ఆగస్టు 4 : కేంద్రంలోని బిజెపి ప్రజా వ్యతిరేక పరిపాలనను నిర్మూలించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కె. విజయరాములు పిలుపునిచ్చారు. మంగళవారం అమరచింతలోని సిపిఐ కార్యాలయంలో బద్లావ్ జరూరి హై మార్పు కావాలి అనే అంశంపై నియోజకవర్గస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విజయరాములు హాజరై మాట్లాడుతూ బిజెపి ప్రజా వ్యతిరేక పరిపాలనను నిరసిస్తూ ఆగస్టు 6 నుండి 14 వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధరల పెరుగుదలను తక్షణమే అరికట్టాలని ప్రతి యువకుడికి ఉద్యోగం కల్పించాలని, పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మిక హక్కులను పరిరక్షించాలని బ్యాలెట్ పేపర్ తో ఎన్నికలను పునరుద్ధరించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు కావలసింది తక్కువ వడ్డీకి రుణాలు నీటిపారుదల వసతులు కల్పించినప్పుడే వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతుందన్నారు. గత దశబ్ద కాలంపైగా నరేంద్ర మోడీ ప్రభుత్వం అపూర్వమైన ప్రగతిని సాధించినట్లు ఒక చిత్రాన్ని ప్రాజెక్ట్ చేస్తుందని ఆరోపించారు. కోట్లాదిమంది ప్రజల జీవితాన్నిభవాలు మాత్రం ఇందుకు భిన్నమైన కథనాలు చెబుతున్నాయని నరేంద్ర మోడీ పరిపాలనలో దళిత బలహీన ఆదివాసి వర్గాలు పూర్తిగా కృషించి పోయాయని ఆరోపించారు. దళిత ఆదివాసీలపై ప్రకృతి దాడులు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ రాజకీయ ప్రచారం పాదయాత్రకు పిలుపునిచ్చినట్టు తెలిపారు. పాదయాత్రలు 2026, సెప్టెంబర్ 1న న్యూఢిల్లీ లోని రామ్ లీలా మైదానంలో జరగబో యేబద్లావ్ జరూరిహై ర్యాలీతో ముగుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మక్తల్ అసెంబ్లీ కన్వీనర్ ఈ శ్రీహరి కోకన్వీనర్ టి నరసింహ, లక్ష్మీ శెట్టి శ్యాంసుందర్ అబ్రహం భాస్కర్ మోష నాగరాజు లక్ష్మీనారాయణ అంజి తో పాటు సిపిఐ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


## రాజకీయాల్లోకి త్రిష రావాలని భారీ పోస్టర్స్!

చెన్నై, ఆగస్టు 4 : తమిళనాడులో రాజకీయాలు హీరోయిన్ త్రిష చుట్టూ తిరుగుతున్నాయి. కావేరి నదీ జలాల వివాదంపై సభ నిర్వహించిన ఉదయనిధి స్టాలిన్... అందులో త్రిషపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు గాను అరెస్ట్ అయ్యారు. ఆయన అరెస్ట్ కంటే ముందు డీఎంకే ఎమ్మెల్యేలు ఇద్దరు త్రిషపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసినందుకు అరెస్ట్ అయ్యారు. రాజకీయ వర్గాల్లో ఈ అరెస్టులు సంచలనం సృష్టించాయి. ఇవి పక్కన పెడితే... మధురైలో వెలిసిన త్రిష పోస్టర్లు ఇప్పుడు తమిళనాట సంచలనంగా మారాయి. సుమారు రెండు దశాబ్దాలకు పైగా స్టార్ హీరోయిన్ స్టేటస్ ఎంజాయ్ చేస్తున్న కొద్ది మంది అందాల భామలలో త్రిష ఒకరు. కోట్లలో ఆమెకు ఫ్యాన్స్ ఉన్నారు. అయితే ఇటీవల మధురైలో కొంత మంది అభిమానులు 'త్రిష ఛారిటీ ఫౌండేషన్ స్టార్ట్ చేయడం చర్చకు దారి తీసింది. రాజకీయ వర్గాల్లో ఆ ఫౌండేషన్ చర్చకు దారి తీసింది. ఇన్నాళ్ళూ లేనిది ఇప్పుడు మధురైలో త్రిష పేరుతో ఫౌండేషన్ స్టార్ట్ చేయడం వెనుక పొలిటికల్ స్కెచ్ ఏమైనా ఉందా? అని రాజకీయ వర్గాల్లో కాస్త వాడి వేడీ చర్చ జరుగుతోంది. ఫౌండేషన్ ప్రారంభించిన సందర్భంగా మధురై అంతటా పోస్టర్లు వేశారు. ఆ పోస్టర్ల మీద 'రాకీయాల్లోకి త్రిష రావాలి' అని ఉంది. అంతే కాదు... 'తమిళనాడు వీరమంగై వేలు నాచియార్' అని త్రిషను పేర్కొన్నారు. వీరమంగై అంటే వీరవనిత, ధైర్య సాహసాలు గల మహిళ అని అర్థం. వేలు నాచియర్ అంటే 18వ శతాబ్దంలో బ్రిటీషర్లకు వ్యతిరేకంగా పోరాటం చేసిన తమిళ మహిళ. ఇప్పుడు అభినవ వేలు నాచియర్‌గా త్రిషను ప్రమోట్ చేస్తున్నారు. అదీ సంగతి. త్రిష పేరుతో ఎవరు రాజకీయం చేసినా విజయ్ సహించడం లేదు. ఆ విధమైన సిగ్నల్స్ స్పష్టంగా ఉన్నాయి. డీఎంకే ఎమ్మెల్యేలను కాదు... ఏకంగా స్టాలిన్ కుమారుడు ఉదయనిధిని సైతం అరెస్ట్ చేయించారు. రాజకీయాల్లోకి త్రిష అడుగు పెట్టే సమయానికి ఆమెకు ఎటువంటి టెన్షన్ లేకుండా చేస్తున్నారా? వంటి ప్రశ్నలు సైతం వస్తున్నాయి. త్రిష సినిమాలకు వస్తే... మెగాస్టార్ చిరంజీవితో 'విశ్వంభర' చిత్రీకరణ పూర్తి చేశారు. మలయాళంలో జీతూ జోసెఫ్ దర్శకత్వంలో మోహన్ లాల్ హీరోగా నటించనున్న థ్రిల్లర్ 'రామ్' యాక్సెప్ట్ చేశారు. తమిళంలో మరో రెండు సినిమాలు ఉన్నాయట.

---

# నకిరేకల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే మా ప్రభుత్వ లక్ష్యం

**ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం**
**256 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ**





సమయం ప్రతినిధి, నల్లగొండ : పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం స్పష్టం చేశారు. మంగళవారం పన్నాలగూడెం క్యాంప్ కార్యాలయంలో రామన్నపేట, చిట్యాల, నార్కట్‌పల్లి, కట్టంగూర్, నకిరేకల్ మండలాలకు చెందిన 256 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు నకిరేకల్ నియోజకవర్గానికి దాదాపు రూ. 23 కోట్ల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. కడపర్తి సమీపంలో రూ. 200 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేయనున్నట్లు ప్రకటించారు. నకిరేకల్ పట్టణంలో 'ఉద్దీపన ఎడ్యుకేషన్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో పేద విద్యార్థుల చదువు కోసం ఉచిత పాఠశాలను అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. నియోజకవర్గానికి మొదటి విడతలో కేటాయించిన 3,500 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయని తెలిపారు. దీనికితోడు రెండో విడత కింద మరో 2,000 ఇండ్లు మంజూరయ్యాయని, వీటిని పూర్తిగా అర్హులైన పేదలకే అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. గత పదేళ్ల పాలనలో ప్రజలకు ఎలాంటి సబ్సిడీలు, సంక్షేమ పథకాల ఫలాలు అందలేదని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలను ప్రస్తావించే ధైర్యం చేయడం లేదని ఎద్దేవా చేశారు. పంపిణీ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి ఆలయాన్ని దర్శించుకున్న జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్





**నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి (ఆగస్టు 4):** నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని పదర మండలం మద్దిమడుగు గ్రామంలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీశ్రీశ్రీ పబ్బతి ఆంజనేయస్వామి దేవాలయాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న జిల్లా కలెక్టర్‌కు ఆలయ ప్రధాన అర్చకులు వీరయ్య పూర్ణకుంభంతో, వేదమంత్రోచ్ఛారణల మధ్య సాంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలు సుఖశాంతులతో జీవించాలని, రైతులకు సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, యువత విద్య, ఉపాధి రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, జిల్లా సమగ్రాభివృద్ధి దిశగా మరింత పురోగతి సాధించాలని స్వామివారిని జిల్లా కలెక్టర్ ప్రార్థించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు వీరయ్య, శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి దేవాలయ చరిత్ర, ఆధ్యాత్మిక విశిష్టత, ఆలయ పురాతన వైభవం, భక్తుల విశ్వాసం, నిత్య పూజా కార్యక్రమాలు, వార్షిక ఉత్సవాల ప్రాముఖ్యత గురించి జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ దేవాలయం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులను ఆకర్షిస్తున్న ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమని, స్వామివారి దర్శనంతో భక్తులు తమ కోరికలు నెరవేరుతాయని విశ్వసిస్తారని తెలిపారు. వేద పండితులు వేదాశీర్వచనాలతో జిల్లా కలెక్టర్‌ను ఆశీర్వదించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ పాల్గొని ఆలయ విశిష్టతను అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించి, భక్తులకు అందిస్తున్న సౌకర్యాలు, పరిశుభ్రత, మౌలిక వసతులపై సంబంధిత అధికారులతో ఆరా తీశారు. ఆలయాన్ని సందర్శించే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ఆలయ ప్రాంగణంలో కలెక్టర్ మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, ఎంపీడీవో సుధాకర్, స్థానిక ఎస్సై, వివిధ శాఖల అధికారులు, ఆలయ అర్చకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## వారణాసి టూ అంటార్కిటికా...


హైదరాబాద్, ఆగస్టు 4 : సూపర్ స్టార్ మహేశ్ బాబు, దర్శక ధీరుడు రాజమౌళి కాంబోలో రాబోతోన్న విజువల్ వండర్ వారణాసి . తండ్రీ కొడుకుల ఎమోషన్ ఈ స్టోరీ అంటూ గతంలో రివీల్ చేశారు రాజమౌళి. తాజాగా ఓ ఇంటర్నేషనల్ మీడియాకి ఇచ్చిన ఇంటర్వ్యూలో షూటింగ్ బిగ్ అప్డేట్‌తో పాటు ఇంట్రెస్టింగ్ విషయాలు షేర్ చేసుకున్నారు.వారణాసి కథ ఆధ్యాత్మిక నగరం వారణాసితో మొదలై అంటార్కిటికా, ఆఫ్రికా అడవుల్లో ప్రయాణించి రామాయణ కాలానికి తీసుకెళ్లి మళ్లీ వారణాసికి తిరిగొస్తుందని చెప్పారు రాజమౌళి. 'నాకు ఇండియానా జోన్స్ కథలంటే చాలా ఇష్టం. పిల్లల నుంచి పెద్దల వరకూ అందరికీ అవి నచ్చుతాయి. స్టోరీ, దాని నేపథ్యం తెలీకుండా ఆడియన్స్ మూవీని ఆస్వాదించలేరు. అందుకే గ్లింప్స్‌లో అన్నింటినీ చూపించాం. షూటింగ్ ఇప్పటికే 80 శాతం పూర్తైంది. ఇంకా 20 శాతంలో చిన్న చిన్న సీన్స్ చేస్తున్నాం. యాక్షన్ పార్ట్ మొత్తం ఎప్పుడో కంప్లీట్ అయిపోయింది.' అని తెలిపారు.2022 నుంచి వారణాసి కథను డెవలప్ చేయడం స్టార్ట్ చేశామని... దాదాపు నాలుగున్నరేళ్లు పట్టిందని చెప్పారు రాజమౌళి. 'కథలో ఉన్న భారీ స్థాయి ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో తీయడానికి కారణం. 300 అడుగులకు పైగా ఉన్న భారీ మంచు కొండ, రామాయణంలోని భారీ వానర సేన ఇలా ఎన్నో కీలక సీన్స్ ఇందులో ఉన్నాయి. వాటిని అద్భుతంగా, విశాలంగా చూపించాలంటే ఐమ్యాక్స్ ఫార్మాట్ సరైనది అనిపించింది.హాలీవుడ్ సినిమాలంటే నాకు చాలా ఆసక్తి. చిన్నప్పటి నుంచి వాటినే చూస్తూ నేను పెరిగాను. ఆ ప్రభావం నా సినిమాలపై ఉంటుంది. నా సినిమాలను హాలీవుడ్ చిత్రాలతో పోలుస్తుంటారు. అందుకు నేనెప్పుడూ ఇబ్బంది పడను.' అని తెలిపారు.అక్టోబర్ కల్లా ఈ మూవీ షూటింగ్ పూర్తవుతుందని రాజమౌళి చెప్పారు. ఆయన గత చిత్రాల కంటే ఈసారి డిఫరెంట్‌గా షూటింగ్‌ను ప్లాన్ చేశారు. చిన్న చిన్న సీన్స్ పూర్తి చేస్తుండగా ప్రస్తుతం హైదరాబాద్‌లోనే షెడ్యూల్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా వేగంగా సాగుతుండగా... బీజీఎం వర్క్స్ కూడా స్టార్ట్ చేసినట్లు ఎంఎం కీరవాణి తెలిపారు. ఇప్పటివరకూ గ్లింప్స్ తప్ప ఈ భారీ ప్రాజెక్టు నుంచి ఎలాంటి సర్ప్రైజెస్ లేవు. మహేశ్ బాబు బర్త్ డే సందర్భంగా టీజర్ రిలీజ్ చేస్తారని భావిస్తున్నారు. మహేశ్ బర్త్ డే గిఫ్ట్‌గా టీజర్ రిలీజ్ చేయాలని లేదా స్పెషల్ లుక్ అయినా రిలీజ్ చేయాలని ఫ్యాన్స్ సోషల్ మీడియా వేదికగా డిమాండ్ చేస్తున్నారు.ఈ మూవీలో రుద్రుడు, శ్రీరాముడిగా మహేశ్ బాబు కనిపిస్తుండగా... విలన్ రణకుంభగా మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్నారు. మందాకినిగా బాలీవుడ్ హీరోయిన్ ప్రియాంక చోప్రా నటిస్తున్నారు. దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో వచ్చే ఏడాది ఏప్రిల్ 7న సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

## జార్ఖండ్‌లో రోడ్కెక్కున విద్యార్థులు

రాంచీ, ఆగస్టు 4 : వేలాదిమంది విద్యార్థులు. చేతిలో ఫ్ల కార్డులు.. అందరివి ఒకటే నినాదాలు.. మాకు న్యాయం జరగాలి.. అక్రమాలకు పాల్పడిన అధికారులు జైలుకు వెళ్లాలి.. విద్యార్థుల గోస పట్టని ప్రభుత్వం దిగిపోవాలి.. మొన్ననే కదా జంతర్ మంతర్ వద్ద నీట్ విద్యార్థులు ఆందోళన చేసింది. పోలీసులతో గొడవపడి.. తాము అనుకున్నది సాధించింది. కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళన దేశవ్యాప్తంగా ఉన్న యువత అగ్రహానికి ప్రతీకగా నిలిచింది. ఇటీవల చాలా రాష్ట్రాలలో కాంపిటీటివ్ ఎగ్జామ్స్ కు సంబంధించిన ప్రశ్న పత్రాలు లీక్ అయ్యాయి. ఈ ఘటనల వెనుక ఉన్న వ్యక్తులను శిక్షించాలని.. విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. చాలామంది విద్యార్థులు రోడ్లమీదకి వచ్చి నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. రోజుల తరబడి నిరాహార దీక్షలు చేస్తున్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం మీద తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు.తాజాగా ఝూర్ఖండ్ రాష్ట్రంలో వేలాది మంది విద్యార్థులు రోడ్లమీదకి వచ్చారు. అక్కడి ప్రభుత్వం దిగిపోవాలని డిమాండ్లు చేస్తున్నారు. దీనికి కాక్రోచ్ జనతా పార్టీ సపోర్ట్ చేస్తుంది.. జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో క్లీన్ జెపిఎస్సి పేరుతో వేలాది మంది విద్యార్థులు నిరవధికంగా నిరాహార దీక్ష చేస్తున్నారు.

## అవినీతి కట్టడికి లాకర్లలో సొమ్ముపై పన్ను

సమయం ప్రతినిధి: ప్రపంచీకరణ తర్వాత భారతదేశ ఆర్థిక ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. ప్రస్తుతం కార్పొరేట్ సంస్థల దగ్గర వేల కోట్లలో సంపద పోగుపడుతోంది. వందల కోట్లలో ప్రభుత్వ ఉద్యోగస్థుల దగ్గర అవినీతి సొమ్ము బయటపడుతోంది. అవినీతి అనేది పెట్టుబడిదారీ వ్యవస్థ సాఫీగా నడవడానికి గ్రీజు లాంటిది అంటారు. ఈ అవినీతి వలన సంపన్నులకు వచ్చే నష్టమేమీ లేదు. బడుగు, పేద, బలహీన వర్గాలవారు మాత్రమే నష్టపోతారు. 'అవినీతి సూచీ--2026' ప్రకారం, అవినీతిలో.. ప్రపంచంలోని 182 దేశాల్లో మన దేశం 91వ స్థానంలో నిలిచింది. భారత్‌కు వంద పాయింట్లకు గాను 39 పాయింట్లు వచ్చాయి. ఇదే జీరో పాయింట్‌కు దిగిపోతే ఆ దేశాన్ని అత్యంత అవినీతిమయ దేశంగా పరిగణిస్తారు. వంద పాయింట్లకు చేరుకుంటే దాన్ని అవినీతిరహిత దేశంగా పరిగణిస్తారు. ప్రపంచీకరణ తర్వాత భారతదేశ ఆర్థిక ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. ప్రస్తుతం కార్పొరేట్ సంస్థల దగ్గర వేల కోట్లలో సంపద పోగుపడుతోంది. వందల కోట్లలో ప్రభుత్వ ఉద్యోగస్థుల దగ్గర అవినీతి సొమ్ము బయటపడుతోంది. అవినీతి అనేది పెట్టుబడిదారీ వ్యవస్థ సాఫీగా నడవడానికి గ్రీజు లాంటిది అంటారు. ఈ అవినీతి వలన సంపన్నులకు వచ్చే నష్టమేమీ లేదు. బడుగు, పేద, బలహీన వర్గాలవారు మాత్రమే నష్టపోతారు. 'అవినీతి సూచీ-2026' ప్రకారం, అవినీతిలో.. ప్రపంచంలోని 182 దేశాల్లో మన దేశం 91వ స్థానంలో నిలిచింది. భారత్‌కు వంద పాయింట్లకు గాను 39 పాయింట్లు వచ్చాయి. ఇదే జీరో పాయింట్‌కు దిగిపోతే ఆ దేశాన్ని అత్యంత అవినీతిమయ దేశంగా పరిగణిస్తారు. వంద పాయింట్లకు చేరుకుంటే దాన్ని అవినీతిరహిత దేశంగా పరిగణిస్తారు. అవినీతి కట్టడిలో భాగంగా- ప్రైవేటు, పబ్లిక్ అన్ని బ్యాంకులలోని లాకర్లను ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వరాదు. లాకర్లను పూర్తిగా బ్యాంకులే మేనేజ్ చేయాలి. లాకర్లలోని డైమండ్స్, బంగారం, వెండి



వాటి బరువు ఆధారంగా నెలవారీ ఆర్నమెంట్ టాక్స్ వసూలు చేయాలి. లాకర్‌లో దాచుకున్న నగదును లెక్కించాలి. నగదు మొత్తంపై కొంత శాతం పన్ను వసూలు చేయాలి. ప్రస్తుతం బ్యాంకులు సంవత్సరానికి కొంత లాకర్ ఫీజును వసూలు చేసి సంతృప్తి పడుతున్నాయి. అది అంత వరకే సరిపోదు. స్థిరాస్తులు, ఇళ్లు, బంగళాలు, ఫ్లాట్ల కాగితాలు దాచుకున్నట్లయితే వాటికి విలువ కట్టాలి. విలువ ఆధారంగా పన్నులు వసూలు చేయాలి. దీనివలన కొంత పారదర్శకత పెరుగుతుంది. అవినీతి సొమ్మును దాచిపెట్టుకోవడం కష్టం అవుతుంది. దీనివలన కొంతమేరకు మార్పు రావచ్చు.

## కర్ణాటక కాంగ్రెస్‌లో రాజీనామాల చిచ్చు

బెంగళూరు, ఆగస్టు 4 : దక్షిణాది భారతదేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో కర్ణాటక ఒకటి కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతే తెలంగాణలో ముఖచిత్రం మారిపోయింది. తెలంగాణలో అధికారంలోకి రావడానికి ప్రధాన కారణం కూడా కర్ణాటకనే.కర్ణాటకలో ఇటీవల ముఖ్యమంత్రి మార్పు జరిగింది. సిద్ధ రామయ్య స్థానంలో డీకే శివకుమార్ కు అధిష్టానం ముఖ్యమంత్రి పీఠం అప్పగించింది. అప్పటినుంచి కర్ణాటక రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారిపోతున్నాయి. కొంతమంది ఎమ్మెల్యేలు శివకుమార్ నాయకత్వాన్ని బహిరంగంగానే వ్యతిరేకించారు. తాజాగా కర్ణాటక రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణ జరుగుతున్న నేపథ్యంలో అక్కడ ఎమ్మెల్యేలు నిరసన స్వరాన్ని అందుకున్నారు. అంతటితోనే వారు ఆగిపోలేదు. ఏకంగా రాజీనామా అస్త్రాన్ని ప్రయోగిస్తున్నారు.క్యాబినెట్లో అవకాశాలు లభించకపోవడంతో చాలామంది ఎమ్మెల్యేలు తీవ్రమైన అసంతృప్తితో ఉన్నారు. ఇండి ఎమ్మెల్యే యశ్వంత రాయగౌడ వి పాటిల్ తన సభ్యత్వానికి రాజీనామా ప్రకటించారు. ఆయన తన రాజీనామా లేఖను డిప్యూటీ స్పీకర్ రుద్రప్ప లమాని కి అందజేశారు.సాగర్ ఎమ్మెల్యే బేలూరు గోపాలకృష్ణ కూడా తన పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. కేవలం తను మాత్రమే కాకుండా.. మరో 10 మంది ఎమ్మెల్యేలు కూడా రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు ఆయన ప్రకటించారు. శివకుమార్ ముఖ్యమంత్రి అయిన తర్వాత మంత్రివర్గాన్ని విస్తరించడానికి రంగం సిద్ధం చేశారు. కొత్తగా 20 మంది ఎమ్మెల్యేలను మంత్రులుగా చేయడానికి మార్గం సిద్ధమైంది. అయితే ఎమ్మెల్యేలు రాజీనామా చేయడం.. మిగతా ఎమ్మెల్యేలు తీవ్రమైన అసంతృప్తితో ఉండడంతో కర్ణాటక ప్రభుత్వంలో కుదుపు మొదలైంది. అందువల్లే కొత్త మంత్రుల ప్రమాణస్వీకారం ఆలస్యం అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.పదిమంది ఎమ్మెల్యేలు రాజీనామా చేస్తే.. కర్ణాటకలో రాజకీయ పరిణామాలు వేగంగా మారిపోతాయి. ప్రభుత్వం కూలిపోయే ప్రమాదం కూడా ఉంటుందని అక్కడి విశ్లేషకులు చెబుతున్నారు. ఇటీవల ప్రభుత్వం తీవ్రమైన ఒత్తిడికి గురైంది. దాని నుంచి కాస్త ఉపశమనం లభిస్తుండగానే ఈ పరిణామం చోటు చేసుకోవడం విశేషం. శివకుమార్ కు కన్నడ పగ్గాలు ఇవ్వడం ఇప్పటికీ కాంగ్రెస్ లో ఓ వర్గానికి ఏమాత్రం ఇష్టం లేదు. శివకుమార్ కింద పనిచేయడం చాలా మంది సీనియర్లకు ఏమాత్రం నచ్చడం లేదు. అందువల్లే వారంతా రాజీనామా చేస్తున్నారు. ఏకంగా పది ఎమ్మెల్యేలు రాజీనామాకు సిద్ధంగా ఉన్నారంటే కర్ణాటక కాంగ్రెస్ లో పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

## నకిలీ ఎరువుల వ్యాపారంపై జిల్లా యంత్రాంగం కఠిన చర్యలు



నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి ఆగస్టు 4 : నాగర్ కర్నూల్ జిల్లాలోని రైతుల ప్రయోజనాలను పరిరక్షించడం, నాణ్యమైన వ్యవసాయ ఇన్‌పుట్లు అందుబాటులో ఉండేలా చూడడమే జిల్లా యంత్రాంగం అత్యున్నత ప్రాధాన్యత అని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తెలిపారు. రైతులను మోసం చేస్తూ నకిలీ ఎరువుల తయారీ, నిల్వ, రవాణా, విక్రయాలకు పాల్పడే వ్యక్తులు, ముఠాల పై ఎలాంటి రాజీ లేకుండా చట్టపరంగా కఠిన చర్యలు కొనసాగిస్తామని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ స్పష్టం చేస్తూ, మంగళవారం ఉదయం పత్రికా ప్రకటన విడుదల చేశారు. నాగర్ కర్నూల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇటీవలే నకిలీ డైఅమ్మోనియం ఫాస్ఫేట్ (డీఏపీ) ఎరువులు విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా పరిపాలన, వ్యవసాయ శాఖ, పోలీసు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. బిజినపల్లి, తిమ్మాజిపేట, తాడూరు, కల్వకుర్తి మండలాల్లో నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో ప్రముఖ ఎరువుల కంపెనీల పేర్లతో నకిలీ లేబుళ్లు అతికించిన మొత్తం 872 డీఏపీ ఎరువుల బ్యాగులు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఈ కేసులకు సంబంధించి బిజినపల్లి పోలీస్ స్టేషన్ (Cr. No.187/2026), తాడూరు పోలీస్ స్టేషన్ (Cr. No.96/2026), కల్వకుర్తి పోలీస్ స్టేషన్ (Cr. No.263/2026)లలో భారతీయ న్యాయ సంహిత (BNS), ట్రేడ్ మార్క్స్ చట్టం, ఎరువుల (నియంత్రణ) ఉత్తర్వులు-1985లోని సంబంధిత నిబంధనల కింద మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.నకిలీ ఎరువుల అక్రమ రవాణా, నిల్వ, సరఫరా వ్యవహారంలో మొత్తం తొమ్మిది మంది ప్రమేయం ఉన్నట్లు గుర్తించామని, వారిలో ఏడుగురిని అరెస్టు చేయగా, పరారీలో ఉన్న మరో ఇద్దరిని పట్టుకునేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయని తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఎరువుల నమూనాలను రాష్ట్ర ఎఫ్‌సీఓ నాణ్యత నియంత్రణ ప్రయోగశాలకు పంపగా, రసాయన విశ్లేషణలో నత్రజని, భాస్వరం వంటి కీలక పోషక ప్రమాణాల్లో తీవ్ర లోపాలు ఉన్నట్లు నిర్ధారణ అయిందన్నారు. దీంతో వాటిని అధికారికంగా నాన్-స్టాండర్డ్ / నకిలీ ఎరువులుగా ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ వెల్లడించారు. నిందితులపై నిత్యావసర వస్తువుల చట్టం-1955లోని సెక్షన్ 3, 7తో పాటు ఇతర వర్తించే చట్టాల ప్రకారం కఠిన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా, నిత్యావసర వస్తువుల చట్టంలోని సెక్షన్ 6A ప్రకారం స్వాధీనం చేసుకున్న ఆస్తులను జప్తు చేసే రెవెన్యూ ప్రక్రియను ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ నాగర్ కర్నూలు జిల్లాలోని రైతులకు పలు సూచనలు చేశారు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందులను తప్పనిసరిగా లైసెన్స్ పొందిన డీలర్లు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (PACS), రైతు సేవా కేంద్రాలు వంటి అధికారిక విక్రయ కేంద్రాల నుంచే కొనుగోలు చేయాలని సూచించారు. ప్రతి కొనుగోలుకు తప్పనిసరిగా అధికారిక బిల్లు లేదా రసీదు తీసుకోవాలని, బిల్లు లేని వస్తువులను ఎట్టి పరిస్థితుల్లోనూ కొనుగోలు చేయవద్దని, గుర్తింపు లేని వ్యక్తులు, రిజిస్టర్ కాని వ్యాపారులు లేదా అనధికార రవాణా వాహనాల ద్వారా ఎరువులు విక్రయించినట్లయితే వాటిని కొనుగోలు చేయరాదని రైతులకు హెచ్చరించారు. నకిలీ ఎరువుల విక్రయాలు, అనుమానాస్పద నిల్వలు లేదా అనధికార విక్రేతల గురించి సమాచారం తెలిసిన వెంటనే స్థానిక మండల వ్యవసాయ అధికారి (ఎంఏఓ) లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో నకిలీ ఎరువుల అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా నిరంతరం కొనసాగుతుందని, రైతులను మోసం చేసే వ్యక్తులు ఎంతటి వారైనా చట్టం ముందు నిలబెట్టి కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మంగళవారం విడుదల చేసిన పత్రికా ప్రకటన ద్వారా స్పష్టం చేశారు.

సమయం
బుధవారం 05 ఆగష్టు 2026

# వంకేశ్వరం గ్రామంలో మినీ స్టేడియం నిర్మాణానికి వేగం

### ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

**నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి ఆగస్టు 4 :** గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసి, యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేలా మినీ స్టేడియం నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధికారులను సూచించారు. అచ్చంపేట నియోజకవర్గంలోని పదర మండలం వంకేశ్వరం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న మినీ స్టేడియం కోసం ప్రతిపాదించిన ప్రభుత్వ భూమిని మంగళవారం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులతో కలిసి స్వయంగా పరిశీలించారు. పదరా మండలంలోని వంకేశ్వరం గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్–254లో ఉన్న 3 ఎకరాల 4 గుంటల స్థలాన్ని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. స్థల విస్తీర్ణం, భూ స్వరూపం, రాకపోకల సౌకర్యం, భవిష్యత్ విస్తరణ అవకాశాలు, మినీ స్టేడియం నిర్మాణానికి అనుకూలత వంటి అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక అంశాలపై అధికారులతో చర్చించి అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ..., రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి గ్రామీణ యువకుడు తన ప్రతిభను ప్రదర్శించుకునేందుకు నాణ్యమైన క్రీడా



వేదికలు అందుబాటులో ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, గ్రామ స్థాయి నుంచే క్రీడలను ప్రోత్సహించడం ద్వారా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచే క్రీడాకారులు తయారవుతారని, వంకేశ్వరం గ్రామంలో ప్రతిపాదిత మినీ స్టేడియం నిర్మాణం పూర్తయిన తర్వాత పదర మండలంతో పాటు పరిసర గ్రామాల యువతకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ తెలిపారు. క్రీడల పట్ల ఆసక్తి ఉన్న యువతకు శిక్షణ, సాధన, పోటీల నిర్వహణకు అవసరమైన వేదికగా ఈ మినీ స్టేడియం నిలుస్తుందని చెప్పారు. గ్రామీణ యువతలో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో ఇటువంటి క్రీడా మౌలిక సదుపాయాలు కీలక పాత్ర పోషిస్తాయని, స్టేడియం నిర్మాణానికి సంబంధించిన భూ రికార్డులు, సర్వే ప్రక్రియ, సాంకేతిక అనుమతులు, పరిపాలనా ప్రతిపాదనలు తదితర అంశాలను ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్మాణానికి అవసరమైన అన్ని ప్రక్రియలను వేగవంతం చేసి, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనులను ముందుకు తీసుకెళ్లాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులో ప్రతిపాదనలను సిద్ధం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరే విధంగా ఉండాలని, ముఖ్యంగా యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని క్రీడా మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన అధికారులకు సూచించారు. అనంతరం ప్రతిపాదిత స్థలాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించిన కలెక్టర్, సంబంధిత శాఖల అధికారుల నుంచి పూర్తి వివరాలు తెలుసుకుని, అవసరమైన నివేదికలను తక్షణమే సిద్ధం చేసి సమర్పించాలని రెవిన్యూ అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి రేవంత్ చంద్ర, ఎంపీడీవో సుధాకర్, వంకేశ్వరం గ్రామ సర్పంచ్ మౌనిక, పంచాయతీ కార్యదర్శి రమ్య, సర్వేయర్ విజయనిర్మల, ఎస్ఐతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధికి గ్రామపంచాయతీలే కేంద్రబిందువు - ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

**దేవరకొండ: ఆగస్టు 4 (సమయం ప్రతినిధి) :** దేవరకొండ నియోజకవర్గం, గుడిపల్లి మండలం భీమనపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించనున్న గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులకు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ శంకుస్థాపన చేసి భూమి పూజ చేశారు. అనంతరం కమ్యూనిటీ డెవలప్మెంట్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో, గ్రామ సర్పంచ్ కసిరెడ్డి శ్రావణి శ్రీనివాస్ రెడ్డి ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన గ్రామ సామాజిక నీటి శుద్ధి కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్. మాట్లాడుతూ, గ్రామాభివృద్ధికి గ్రామపంచాయతీలు కీలకమైన వ్యవస్థ అని అన్నారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రతి గ్రామంలో ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా అందుబాటులో ఉండేలా గ్రామపంచాయతీ భవనాల నిర్మాణం, అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. నూతన గ్రామపంచాయతీ భవనం నిర్మాణం పూర్తయిన తర్వాత గ్రామ ప్రజలకు అన్ని పరిపాలనా సేవలు ఒకే చోట అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. జనన, మరణ ధృవీకరణ పత్రాలు, కుటుంబ ధృవీకరణలు, పన్నుల చెల్లింపులు, పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ, తాగునీటి సమస్యల పరిష్కారం, వీధి దీపాల నిర్వహణ, సంక్షేమ పథకాల అమలు, గ్రామసభల నిర్వహణ, అభివృద్ధి పనుల ప్రణాళిక వంటి అనేక సేవలు మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి ఈ భవనం ఉపయోగపడుతుందని చెప్పారు.



గ్రామ ప్రజలు గ్రామసభల్లో చురుకుగా పాల్గొని గ్రామ అభివృద్ధికి సంబంధించిన తమ సమస్యలు, సూచనలు ప్రజాప్రతినిధులు మరియు అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. గ్రామపంచాయతీ కార్యాలయం కేవలం పరిపాలనా భవనం మాత్రమే కాకుండా గ్రామ అభివృద్ధికి మార్గనిర్దేశం చేసే ప్రజల వేదికగా నిలవాలని అన్నారు. అనంతరం ప్రారంభించిన "గ్రామ సామాజిక నీటి శుద్ధి కేంద్రాన్ని" పరిశీలించిన ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు కేవలం 5 రూపాయలకే ఒక క్యాన్ స్వచ్ఛమైన తాగునీరు అందించే ఈ కార్యక్రమం ఎంతో ఆదర్శవంతమైనదని కొనియాడారు. సురక్షితమైన తాగునీరు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుందని, ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన మంచినీరు అందించడం అభినందనీయమైన కార్యక్రమమని అన్నారు. కమ్యూనిటీ డెవలప్మెంట్ ఫౌండేషన్ మరియు గ్రామ సర్పంచ్ కసిరెడ్డి శ్రావణి శ్రీనివాస్ రెడ్డి గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని చేపట్టిన ఈ కార్యక్రమం ఇతర గ్రామాలకు కూడా ఆదర్శంగా నిలవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. గ్రామ ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని స్వచ్ఛమైన తాగునీటిని వినియోగించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, పారిశుద్ధ్యం, గ్రామపంచాయతీ మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన నిధులను కేటాయిస్తూ గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోందని ఎమ్మెల్యే బాలు నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, జిల్లా నాయకులు, స్థానిక గ్రామ సర్పంచ్ కసిరెడ్డి శ్రావణి శ్రీనివాస్ రెడ్డి, కమ్యూనిటీ డెవలప్మెంట్ ఫౌండేషన్ ప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను సమన్వయంతో ఘనంగా నిర్వహించాలి



**నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి ఆగస్టు 4 :** ఈ నెల 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జాతీయ భావం ఉట్టిపడేలా ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు తమకు కేటాయించిన బాధ్యతలను సమన్వయంతో నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సూచించారు. మంగళవారం నాగర్‌కర్నూలు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్,అదనపు కలెక్టర్లు చెన్నయ్య, దేవ సహాయం,అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లుతో కలిసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,...... ఆగస్టు 15న జరిగే వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారులు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖల తరపున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతిబింబించేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలని, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, పుర ప్రముఖులు, అతిథులకు ఆహ్వాన పత్రాలు అందజేయాలని, జిల్లా ప్రగతిపై రూపొందించే సందేశం సీపీఓ, రూపొందించాలని ఆదేశించారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను విద్యా శాఖ అధికారులు చేపట్టాలని, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే అగ్నిమాపక యంత్రాలను సిద్ధంగా ఉంచడం, తాగునీరు, స్నాక్స్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించడం, వేదిక అలంకరణ, పూలమొక్కల ఏర్పాటు, తివాచీలు, బ్యారికేడ్లను పటిష్టంగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పోలీసు బందోబస్తు, గౌరవ వందనం, పోలీసు బ్యాండ్ తదితర ఏర్పాట్లను ఎలాంటి లోపాలకు తావులేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వ్యవసాయ, ఉద్యానవన, జిల్లా గ్రామీణాభివృద్ధి, పశు సంవర్ధక, విద్య, వైద్యం, స్త్రీ శిశు సంక్షేమం, పౌర సరఫరాల, పంచాయతీరాజ్, తదితర శాఖల పనితీరును చాటేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రొటోకాల్ ను అనుసరిస్తూ అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, వేడుకలు విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తి నుండి అమరచింతకు బస్సులు నడిపించాలి

**వనపర్తి :** వనపర్తి జిల్లా బస్టాండు నుంచి తెలంగాణ ఆర్టీసీ బస్సులను మండల కేంద్రమైన అమరచింత మున్సిపాలిటీకి నేరుగా బస్సులు నడపాలని, మహబూబ్ నగర్ లో ఉన్న తెలంగాణ ఆర్టీసీ జిల్లా ఆర్ఎం కి పలుమార్లు విన్నవించి వినతి పత్రం ఇచ్చామని అమరచింత నియోజకవర్గ అభివృద్ధి నాయకులు చెప్పారు., వనపర్తి లో ఉన్న డిఎం కి వినతి పత్రాలతో పాటు నిరసనలు తెలిపాము, మనకు కూడా నాయకుని అని చెప్పుకునే నాయకుడికి! ఎన్నో సందర్భాల్లో వినతి పత్రాలతో పాటు, సమస్యను వివరించాం అయినా లాభమేమీ లేదు. అందుకే అమరచింత మున్సిపాలిటీ ప్రజానీకానికి ఒక వినతి.. స్వచ్ఛందంగా కొంతమందిమీ కలిసి బస్సు భవనం ముందు (హైదరాబాదులో) నిరసన తెలుపడానికి సిద్ధపడ్డాం. మీలో ఎవరైనా ఉత్సాహవంతులు, "మన మున్సిపాలిటీ పై ప్రేమ అనురాగాలు కలిగిన వ్యక్తులు ఎవరైనా ఉంటే సంప్రదించండి. కలుపుకొని వెళ్తాం." తెలంగాణ రాష్ట్ర రాజధానిలో మన అమరచింత మున్సిపాలిటీ పై జరుగుతున్నటువంటి వివక్షను ఎలుగెత్తి చూపడానికి, అసమర్థ



నాయకుల వల్ల మనం కోల్పోయింది వివరించేందుకు కూడా అవకాశం ఉంటుంది. ఎవరు అవునన్నా, కాదన్నా, అమరచింత మున్సిపాలిటీలో SBI బ్యాంక్ సాధన కొరకు క్రియాశీల పాత్ర పోషించినటువంటి బిజెపి పార్టీ వ్యక్తులకు(నాయకులకు) హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.




OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085